ప్రజాశక్తి

బుధవారం 10 మే 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ప్రభుత్వ వైఫల్యానికి విద్యార్థులు మూల్యం



- జెడ్‌పిల్లో దిగజారిన పది ఫలితాలు
- మేడిచర్లలో జీరో ఫలితం
- ఉపాధ్యాయుల కొరతే కారణం
- పరీక్షలకు ముందు పలువురికి స్థాన చలనం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఈ ఏడాది సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని పది ఫలితాలపై పడింది. సబ్జెక్టు టీచర్లను భర్తీచేయకుండా సీనియర్ సెకెండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించి పాఠ్యాంశాల బోధన బాధ్యతను ప్రభుత్వం అప్పగించింది. మరోవైపు పదో తరగతి పరీక్షలకు ముందు ఫిబ్రవరిలో పది విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులను రేషనలైజేషన్ పేరుతో వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేసింది. పరీక్షలకు ముందు ఉపాధ్యాయులను ఒక పాఠశాల నుంచి మరొక పాఠశాలకు పంపించకూడదన్న ప్రాథమిక విద్యా సూత్రాన్ని పక్కనపెట్టి స్థాన చలనం చేసింది. ప్రమోషన్లు పొందిన సీనియర్ సెకెండరీ గ్రేడ్ టీచర్లకు సబ్జెక్టుపై పూర్తిస్థాయి బోధనానుభవం లేకుండానే తరగతులను విద్యాశాఖాధికారులు కేటాయించారు. ప్రభుత్వ తప్పిదాలే జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలల్లో పది ఫలితాలు పడిపోవడానికి దారితీశాయి.

జిల్లాలోని 203 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 13,367 మంది పరీక్షలకు హాజరుకాగా వీరిలో 9,461 మంది పాసయ్యారు. 3,906 మంది ఫెయిలయ్యారు. ఐదు జెడ్‌పి పాఠశాలల్లో శత శాతం ఉత్తీర్ణులయ్యారు. చీడికాడ మండలంలోని బైలపూడి జెడ్‌పి పాఠశాలలో 26 మంది, దేవరాపల్లి మండలంలో వేచలంలో 27 మంది, అలమండ కొత్తపల్లిలో 26 మంది, ముషిడిపల్లిలో ఏడుగురు, కాలిగొట్లలో 15 మంది పరీక్షలకు హాజరుకాగా అందరూ పాసయ్యారు. కె.కోటపాడు మండలం మేడిచర్ల జెడ్‌పి ఉన్నత పాఠశాలలో పరీక్షలకు హాజరైన ఇద్దరూ మిగతా 2లో..

జెడ్‌పి, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం వివరాలు

ఉత్తీర్ణతా శాతం	జెడ్‌పి	ప్రభుత్వ పాఠశాల
10లోపు	2	-
10-20	-	-
20-30	1	-
30-40	2	1
40-50	6	1
50-60	25	1
60-70	52	2
70-80	44	2
80-90	43	2
90-100	23	1
100 శాతం	5	1



ప్రశంసా పత్రాలు అందజేస్తున్న సుశీల

నర్సింగ్ సిబ్బంది సేవలు వెలకట్టలేనివి

ఆంధ్రప్రదేశ్ నర్సెస్, మిడ్‌వైవ్స్ కౌన్సిల్ రిజిస్ట్రార్ సుశీల

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నర్సింగ్ సిబ్బంది సేవలు వెలకట్టలేనివని ఆంధ్రప్రదేశ్ నర్సెస్, మిడ్‌వైవ్స్ కౌన్సిల్ రిజిస్ట్రార్ ఆచార్య కె.సుశీల అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా ఇంటర్నేషనల్ నర్సెస్ వీక్ సెలబ్రేషన్స్‌లో భాగంగా ఎయు స్నాతకోత్సవ మందిరంలో నిర్వహిస్తున్న క్రీడా, సాంస్కృతిక పోటీల కార్యక్రమాల ముగింపు సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో ఎంతో ప్రత్యేకతను, గుర్తింపును, గౌరవాన్ని కలిగిన వృత్తుల్లో ఒకటిగా ఇది నిలుస్తుందన్నారు. వ్యక్తి ప్రాణాలను రక్షించే వైద్యులకు సహాయకారిగా, వైద్య వ్యవస్థలో ప్రధాన అంగంగా నర్సింగ్ వ్యవస్థ దశాబ్దాలుగా నిలుస్తోందన్నారు. ఫ్లోరెన్స్ నైటేంగేల్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఈ వృత్తిలో విశిష్ట గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. అనంతరం క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు.

మంగళవారం ఉదయం రెండో రోజు కార్యక్రమాలను జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ప్రారంభించారు. ఫ్లోరెన్స్ నైటేంగేల్ చిత్రపటానికి పూలమాల మిగతా 2లో..



చలివేంద్రంలో నీరు లేని పాత్రలను చూపుతున్న ప్రయాణికులు

చలివేంద్రాలు సరే.. నీళ్లేవీ..!

విశాఖ నగరంలో 184 చోట్ల జివిఎంసి చలివేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ నిర్వహణ సరిగా లేకపోవడంతో అవి నిరుపయోగంగా మారుతున్నాయి. ఈ చలివేంద్రాల ఏర్పాటుకుగాను కాంట్రాక్టర్లకు జివిఎంసి రూ.75 లక్షల మేర చెల్లిస్తోంది. అయినప్పటికీ వారు అన్ని చలివేంద్రాల వద్దా నీటిని అందుబాటులో ఉంచడం లేదు. మంగళవారం రామాటాకీస్ పరిసర ప్రాంతంలోని ఓ చలివేంద్రానికి ప్రయాణికులు రాగా వారికి ఖాళీ పాత్రలే దర్శనమిచ్చాయి. ఆ దృశ్యాన్ని ప్రజాశక్తి క్లిక్‌మనిపించింది.

గంజాయి అక్రమ రవాణాపై కొరడా

విశాఖ రేంజ్ డిఐజి హరికృష్ణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఒడిశా కేంద్రంగా సాగుతున్న గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు ముమ్మర చర్యలు చేపట్టనున్నట్టు విశాఖ రేంజ్ డిఐజి ఎస్.హరికృష్ణ తెలిపారు. విశాఖ నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఉత్తరాంధ్ర జిల్లాల ఎస్‌పిలతో ఆయన మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రంలోని మల్కనగిరి, కోరాపుట్ జిల్లాల కేంద్రంగా గంజాయి రవాణా సాగుతోందని, అది విశాఖ మీదుగా ఈశాన్య రాష్ట్రాలకు చేరుతోందని అన్నారు. ఆపరేషన్ పరివర్తన్ పేరుతో అల్లూరి సీతారామరాజు జిల్లాలో గత ఏడాది 7570 ఎకరాల గంజాయి సాగును నాశనం చేశామని, ఈ ఏడాది ఇప్పటికే 1039 ఎకరాల్లో గంజాయి పంటను నాశనం చేశామని, గత ఏడాదితో పోల్చుకుంటే గంజాయి సాగును భారీగా నివారించగలిగామని తెలిపారు అంతేగాకుండా ఆరు జిల్లాలలో గంజాయి రవాణాపై పూర్తిస్థాయిలో నిఘా ఏర్పాటు చేశామని, ఇప్పటికే పలు ప్రాంతాల్లో చెక్ పోస్ట్‌లు నెలకొల్పామని, అవసరాన్ని బట్టి మరిన్ని చెక్‌పోస్ట్‌లు పెట్టి గంజాయి అక్రమ రవాణాను పూర్తిగా నియంత్రిస్తామని అన్నారు.



సమావేశంలో పాల్గొన్న విశాఖ రేంజ్ డిఐజి హరికృష్ణ, సిపి త్రివిక్రమ్ వర్మ, పలువురు ఎస్‌పిలు

విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ సిఎం త్రివిక్రమ్ వర్మ మాట్లాడుతూ విశాఖ జిల్లాలో గత ఏడాది గంజాయి అక్రమ రవాణాకు సంబంధించి 255 కేసులు నమోదు చేసి 332 మందిని అరెస్ట్ చేశామని తెలిపారు. 6200 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని నాశనం చేశామని, మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ప్రభుత్వ వైఫల్యానికి విద్యార్థులు మూల్యం

ఫెయిలయ్యారు. 11 ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత ఒక పాఠశాలలో వచ్చింది. ఫెయిలైన 3,906 మంది విద్యార్థుల్లో ఒక సబ్జెక్టులో 902 మంది, రెండు సబ్జెక్టుల్లో 905 మంది, మూడు సబ్జెక్టుల్లో 538 మంది, నాలుగు సబ్జెక్టుల్లో 311 మంది, ఐదు సబ్జెక్టుల్లో 165 మంది, ఆరు సబ్జెక్టుల్లో 85 మంది ఉన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై కొరడా

85 వాహనాలను సీజ్ చేశామని ఆయన తెలిపారు. అంతేగాకుండా అనుమానిత వ్యక్తులపై ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాల్సిందిగా నగరంలో ఉన్న 510 హోటళ్లకు నోటీసులు అందించామని అన్నారు. నగరంలో 165 లారీ ట్రాన్స్‌పోర్టు సంస్థలు ఉండగా అందులో 130 లారీ ట్రాన్స్‌పోర్టు సంస్థలకు నోటీసులు ఇచ్చామని, వారితో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. ఒక ట్రాన్స్‌పోర్టు సంస్థ ఇచ్చిన సమాచారం మేరకు ఇప్పటికే 40 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని అన్నారు. నగరంలో ఏర్పాటు చేసిన మార్పు కౌన్సిలింగ్ సెంటర్ ద్వారా 550 మందికి కౌన్సిలింగ్ ఇచ్చి వారిలో మార్పు తీసుకు రాగలిగామని తెలిపారు. అనకాపల్లి ఎస్‌పి కెవి.మురళీకృష్ణ మాట్లాడుతూ 224 కేసులు నమోదు చేశామని 521 మందిని అరెస్ట్ చేశామని వెల్లడించారు. 21,571 కేజీల గంజాయి నాశనం చేసామని, 141 వాహనాలను సీజ్ చేసామని తెలిపారు. 136 ప్రాంతాల్లో మారక ద్రవ్యాల నిరోధక అవగాహన సదస్సులు ఏర్పాటు చేశామన్నారు. శ్రీకాకుళం ఎస్‌పి జిఆర్.రాధిక మాట్లాడుతూ ఒడిశా సరిహద్దు తమ ప్రాంతానికి దగ్గరగా ఉండటం వల్ల మరింత అప్రమత్తంగా ఉన్నామని, రెండుచోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. స్ఫూర్తి కార్యక్రమంతో పోలీసు బృందాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విజయనగరం ఎస్‌పి ఎం.దీపిక మాట్లాడుతూ ఇప్పటి వరకూ 2023లో 19 కేసులు నమోదు చేసి 46 మందిని అరెస్ట్ చేసామని, 12 చెక్ పోస్టులు ఏర్పాటు చేసామని, విజయనగరం రైల్వే స్టేషన్‌లో శాశ్వత ప్రాతిపదికన ఒక చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశామని తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా మాట్లాడుతూ గంజాయి సాగును నివారించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ తమ జిల్లాలో ఒడిశాది కొంత సరిహద్దు ఉన్నందున నాలుగు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు.

నర్సింగ్ సిబ్బంది సేవలు వెలకట్టలేనివి

వేసి నివాళ్లర్పించారు. విపత్కర సమయాలలో సైతం నర్సింగ్ సిబ్బంది అపూర్వ సేవలు అందించి దేశ ప్రజల మన్ననలు పొందారన్నారు. భారత దేశం కోవిడ్ మహమ్మారి నుంచి సురక్షితంగా బయటపడటంలో నర్సింగ్ సిబ్బంది సేవలు విలువైనవన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో ఎపిఎన్ఐఎంఎ అధ్యక్షురాలు డాక్టర్ సునీత రెడ్డి, కార్యదర్శి పి.సునీల్, కోశాధికారి లక్ష్మీ నరసింహం, సమన్వయకర్త ఎం.ప్రీతం లూక్ పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇటీవల పదోతరగతి ఫలితాల్లో మంచి ప్రతిభ కనబరిచిన ఎస్‌విఎల్‌టి పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎం.కావ్యకు స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థకు చెందిన గైడ్ చైతన్య ఆర్థిక సాయం అందజేశారు. మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.లక్ష్మణరావు, బిఎస్‌జి స్టేట్ కమిషనర్ నరవ ప్రకాశరావు ద్వారా నగదును విద్యార్థినికి అందించి అభినందించారు. ఈ సందర్భంగా నరవ ప్రకాశరావు మాట్లాడుతూ, కావ్య చదువు కొనసాగించేందుకు తగిన సహాయ సహకారాలు ఏర్పాట్లుచేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ షరీఫ్, కావ్య తండ్రి రమణ తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ ఉమెన్ ఫ్యాకల్టీగా జ్యోతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎస్‌విఎల్‌ఎన్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు సిహెచ్ జ్యోతి 'ది బెస్ట్ ఉమెన్ ఫ్యాకల్టీ' అవార్డుకు ఎంపికయ్యారు. ఏటా వివిధ రంగాల్లో సేవ, నైపుణ్యం, ప్రతిభ ఆధారంగా ఎంపిక విధానం ఉంటుంది. తమిళనాడుకు చెందిన చెన్నై గ్రాబ్స్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు ఏప్రిల్ 30న ఈ అవార్డును ప్రదానం చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. అవార్డు గ్రహీత జ్యోతిని ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

వ్యాపార రుణాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ త్వరిత ఆమోదంతో వాట్సాప్ ద్వారా కస్టమర్లకు రూ.10 లక్షల వరకు వ్యాపార రుణాన్ని అందించనుందని ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ అన్‌సెక్యూర్డ్ లెండింగ్ బిజినెస్ హెడ్ భరత్ అగర్వాల్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. వాట్సాప్‌లో ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ బిజినెస్ లోన్ అనేది ఎంఎస్ఎంఇ లెండింగ్ పరిశ్రమలో మొట్టమొదటిసారిగా ప్రవేశపెట్టినట్టు తెలిపారు. రుణ దరఖాస్తు మొదలుకొని డబ్బు అందించడం వరకు అంతా వంద శాతం డిజిటల్‌గా జరుగుతుందన్నారు. వాట్సాప్ వినియోగదారులు 9019702184కి హాయ్ అని పంపడం ద్వారా ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ రుణాన్ని పొందవచ్చన్నారు.

సంతోష్ రెడ్డికి అభినందనలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇటీవల విశాఖ డిస్ట్రిక్ట్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన డివిఎస్ఎన్.మూర్తి మెమోరియల్ అభిస్ జిమ్ క్లాసిక్ మిస్టర్ విశాఖ పోటీల్లో 65 కేజీల విభాగంలో విజేతగా నిలిచిన ఎస్.సంతోష్ రెడ్డిని పలువురు క్రీడాకారులు మంగళవారం అభినందించారు. సంతోష్ రెడ్డి నగర ప్రముఖులు పరశురామరాజు చేతులమీదుగా మిస్టర్ విశాఖ టైటిల్‌ను ఇటీవల అందుకున్న విషయం తెలిసిందే.

సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో ఈ నెల 11న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో రోడ్లపై, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు, బ్యానర్లు లేకుండా చర్యలు చేపట్టాలని, సెంటర్ మీడియన్లలో పిచ్చి మొక్కలను తీసివేసి అందంగా తీర్చిదిద్దాలని అధికారులను జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. మంగళవారం ఆయన ప్రధాన ఇంజినీర్ రవికృష్ణ రాజు, అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, చీఫ్ సిటీ ప్లానర్ బి.సురేష్ కుమార్‌లతో కలిసి ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రాంతాలను, రోడ్ల పరిశుభ్రతను పరిశీలించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విశాఖ నగరంలోని పిఎం.పాలెం క్రికెట్ స్టేడియం, ఆరిలోవ అపోలో హాస్పిటల్, బీచ్ రోడ్డులోని సీ హారియర్ మ్యూజియం ప్రాంతాల్లో సిఎం పర్యటన ఉంటుందని, ఆయా చోట్ల అనధికారికంగా ప్రదర్శించిన బ్యానర్లను తొలగించాలని సిసిపిలకు ఆదేశించారు. పారిశుధ్య పనులు సక్రమంగా సాగాలన్నారు. విద్యుత్ దీపాలను పరిశీలించాలని, రోడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రధాన ఇంజినీర్ రవికృష్ణ రాజుకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో పర్యవేక్షక ఇంజినీర్లు పాల్గొన్నారు.



ఏర్పాట్లును పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

కారుణ్య నియామక పత్రాల అందజేత



కారుణ్య నియామక పత్రం అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, కలెక్టరేట్ : ప్రభుత్వ ఉద్యోగులు నిజాయితీగా, నిస్వార్థంగా అంకితభావంతో ప్రజలకు సేవలందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు మంగళవారం సాయంత్రం ఆయన కారుణ్య నియామకాల ఉత్తర్వులను కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అందజేశారు. విశాఖపట్నం జిల్లాలో 40 మంది జూనియర్ అసిస్టెంట్లు, 5 ఆఫీస్ సబార్డినేట్లు వెరసి 45 పోస్టులను కారుణ్య నియామకం కింద చేపట్టినట్లు వెల్లడించారు. ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకూ 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఈరోజు ఉద్యోగాలు పొందిన అభ్యర్థులతో కలిపి 244 మందికి నియామక పత్రాలు అందజేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఉద్యోగంలో చేరిన తరువాత కూడా ఉన్నత విద్యనభ్యసించాలని ఆకాంక్షించారు. నూతనంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన వారందరూ నిస్వార్థంగా, నిష్పక్షపాతంగా, నిజాయితీగా తమ విధులను నిర్వహించాలన్నారు. ఉద్యోగం పొందిన ప్రతి అభ్యర్థీ చేసే పనిలో నైపుణ్యత, నాలెడ్జ్, అవగాహన కలిగి ఉంటే ఉన్నత స్థితికి చేరుకోవచ్చునని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎంతో మంది వేచి చూస్తున్నారని, క్లిష్ట సమయంలో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని అన్నారు. విధి నిర్వహణలో ఏ పని అప్పగించినా బాధ్యతాయుతంగా పనిచేసి ఉన్నతాధికారుల గుర్తింపు పొందాలని అన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, డిఆర్‌ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, కలెక్టరేట్ కార్యాలయ పరిపాలన అధికారి ఈశ్వరరావు పాల్గొన్నారు.

తప్పుడు ఫిర్యాదులను నమ్మొద్దు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఫార్మాసిటీ నిర్వాసిత గ్రామాలకు చెందిన అసలైన లబ్ధిదారుల ఇళ్లలో మేజర్లు అయినవారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, దీనిపై కొందరు చేస్తున్న తప్పుడు ఫిర్యాదులను, కొన్ని పత్రికల్లో వస్తున్న వార్తలను నమ్మొద్దని కోరుతూ ఫార్మాసిటీ నిర్వాసిత గ్రామాల ప్రజలు మంగళవారం కలెక్టర్‌ను కోరారు. వారంతా కలెక్టరేట్ ఆవరణలో తొలుత నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ 2004లో అప్పటి ప్రభుత్వం ఫార్మాసిటీ నిర్మాణం కోసం పరవాడ మండలం లేమర్తి, ఈదులపాక బోనంగి, కొత్తపాలెం, పొన్నూరు అగ్రహారం, పాలకాలపేట, దొప్పవారిపాలెం, ఎదురువానిపాలెం గ్రామాలకు చెందిన భూములను, నివాస గృహాలను ప్రజల అంగీకారం మేరకు సర్వే చేసి భూములను, ఇళ్లను 2007లో తీసుకొని నిర్వాసితులందరికీ నష్టపరిహారం చెల్లించారని తెలిపారు. అదే సందర్భంలో నిర్వాసితులందరికీ అగనంపూడి వద్ద ఇళ్ల స్థలాలను కేటాయించి పక్కా గృహాలు నిర్మించి ఇచ్చారని తెలిపారు. అంతేకాకుండా నిర్వాసితులలో ఇంటికి ఒకరు చొప్పున మేజర్ అయిన వారికి కూడా ఇళ్ల స్థలాలను ఇవ్వాలని అప్పట్లో కోరగా ప్రభుత్వం అంగీకరించిందన్నారు. కానీ ఆ తరువాత కాలంలో ప్రభుత్వం మేజర్లకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదన్నారు. దీనిపై తాము కోర్టును ఆశ్రయించగా కోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు.

కెజిహెచ్‌కు అండగా దాతలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సింహాద్రి టిఎంటి, హిమ హ్యుమానిటేరియన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం కెజిహెచ్‌కు లక్షల విలువైన బిపి ఆపరేటర్లను విరాళంగా అందజేశారు. కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్, ఎఆర్ఎమ్ డాక్టర్ అరుణాదేవి వీటిని స్వీకరించారు. ఈ సందర్భంగా హిమ హ్యుమానిటేరియన్ వ్యవస్థాపకులు టివిడి.దాస్ అధ్యక్షతన సభ జరిగింది. ఈ సందర్భంగా కెజిహెచ్ సూపరింటెండెంట్ అశోక్ కుమార్ మాట్లాడుతూ ఈ రెండు సంస్థలూ 32 సంవత్సరాలుగా కెజిహెచ్‌కు అవసరమైన విలువైన పలు పరికరాలను సామాజిక బాధ్యతగా అందజేస్తుండడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ మెట్రోపాలిటన్ పూర్వపు మెజిస్ట్రేట్ పైలా సన్నిబాబు, హ్యూమానిటేరియన్ చైర్మన్ బిఎన్.మూర్తి, టిఎంటి డైరెక్టర్ వివి.కృష్ణారావు, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సులోచన, సూపరింటెండెంట్ విజయలక్ష్మి, డాక్టర్ జగదీష్, మీసాల రామకృష్ణ, పల్లా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుటేరు వద్ద ఫిష్ ల్యాండింగ్ సెంటర్

- 6 ఎకరాల విస్తీర్ణంలో రూ.28.7 కోట్లతో ఎన్నో సదుపాయాలు
- ఫిష్ డ్రైయింగ్ ప్లాట్ ఫామ్‌లు, ఆక్షన్ హాల్, వలల మరమ్మతులకు వీలుగా షెడ్ల నిర్మాణం
- 170 బోట్లు యాంకరింగ్‌కు వీలుగా ఏర్పాట్లు
- 11న సిఎంచే శంకుస్థాపన

ప్రజాశక్తి- భీమునిపట్నం : స్థానిక జివిఎంసి జోనల్ కార్యాలయం ఎదురుగా ఉప్పుటేరు వద్ద రూ 28.7కోట్లతో మత్స్యశాఖ అనుసంధానంతో ఎపి మెరైన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపిఎంఐడిసిఎల్), ఎపి మారిటైమ్ బోర్డ్ సంయుక్తంగా 6 ఎకరాల విస్తీర్ణంలో పలు సదుపాయాలతో ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌ను రాష్ట్ర ప్రభుత్వం నిర్మించనుంది. సముద్రంలో వేటాడే మత్స్య సంపదను ఒడ్డుకు చేర్చిన తర్వాత దాన్ని ట్రక్కులు, వ్యాన్లు, ఇతర వాహనాల ద్వారా ఎగుమతి చేసుకునేలా సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకు సిమెంట్ ప్లాట్ ఫామ్‌లు, లేదా చిన్న పాటి సిమెంట్ రోడ్డు నిర్మించనున్నారు. ఒడ్డుకు చేర్చిన మత్స్య సంపద కొంత మంది వ్యాపారులు ఏక మొత్తంగా వేలం పాడుకునేందుకు వీలుగా హాల్ నిర్మాణం జరుగనుంది. మత్స్య సంపద ల్యాండింగ్, లోడింగ్ ఏరియా ఏర్పాటు చేయనున్నారు.

వలల మరమ్మతులకు వీలుగా షెడ్లు నిర్మాణం చేపట్టనున్నారు. సమీపంలో ఉన్న మత్స్యకార ప్రాంతాలు ఎగువపేట, బోయి వీధి, తోట వీధి, కొద్ది దూరంలో ఉన్న పెదనాగమయ్యపాలెం గ్రామాలకు చెందిన మత్స్యకారుల, యాజమానుల బోట్లు దాదాపు 170 వరకు ఫిష్ లాండింగ్ సెంటర్ వద్ద యాంకరింగ్‌కు వీలుగా నిర్మాణం జరుగనుంది.

మత్స్యశాఖ ఎంపిక చేసి ప్రతిపాదించిన ఉప్పుటేరు వద్ద 6 ఎకరాల విస్తీర్ణంలో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ ఏర్పాటుకు ఎట్టకేలకు కాకినాడ పోర్టు అధికారులు ఆమోదించారు. దీంతో ఈ సెంటర్ ఏర్పాటుకు సిఎం జగన్మోహన్ రెడ్డి ఈ నెల 11న శంకుస్థాపన చేయనున్నారు.


భీమిలిలో ఫిష్ లాండింగ్ సెంటర్ ఏర్పాటుచేసే స్థలం

మత్స్య కారులకు ఉపయోగం...

భీమిలి ఉప్పుటేరు వద్ద ఫిష్ లాండింగ్ సెంటర్ ఏర్పాటు వల్ల సమీప ప్రాంతాల మత్స్యకారులు, బోటు యజమానులకు ఉపయోగం. ఇప్పటి వరకూ ఈ ప్రాంతంలో చేపల వేటకు వెళ్లే ఇంజను బోట్లు, తెప్పలు ఒడ్డునే నిలిపే పరిస్థితి ఉండేది. సముద్రంలో అలల తాకిడి, ఆటు పోట్ల సమయంలో బోట్లు ఒకదానిని మరొకటి ఢీ కొని దెబ్బతినడం జరిగేది. అలానే ఒక్కో సందర్భంలో వీచిన గాలులకు బోట్లు, తెప్పలు సముద్రంలో కొట్టుకు పోయేవి. ఫిష్ లాండింగ్ సెంటర్ ఏర్పాటు వల్ల ఈ పరిస్థితి నుంచి బయటపడవచ్చు. బోట్లు యాంకరింగ్‌కు వీలుగా నిర్మాణ పనులు జరుగుతాయి. వేటాడి ఒడ్డుకు తెచ్చిన చేపలను చెట్ల కిందనో, మండే ఎండలోనో అమ్మే పరిస్థితి ఉండేది. ఇకనుంచి ఆ పరిస్థితి ఉండదు. విశాలమైన షెడ్లు నిర్మాణం చేపట్టనున్నారు. మత్స్య కారులకు శారీరక శ్రమ తక్కువగా ఉంటుంది. ఎందుకంటే ఈ సెంటర్ ద్వారా చేపల ఎగుమతులకు వీలుగా రవాణా సదుపాయం అందుబాటులోకి రానుంది.



డి.లావణ్య
మత్స్యశాఖ అభివృద్ధి అధికారి
భీమునిపట్నం

బోట్లు యాంకరింగ్ చేసుకోవచ్చు

ఉప్పుటేరు వద్ద ఫిష్ ల్యాండింగ్ సెంటర్ ఎప్పటినుంచో వస్తుందని చెప్పారు. ఇప్పుడు మంజూరైంది. ఈ సెంటర్ ఏర్పాటు వల్ల వేటాడి తెచ్చుకున్న చేపలను సులభంగా ఒడ్డుకు చేర్చవచ్చు. శారీరక శ్రమ తగ్గుతుంది. బోట్లు, తెప్పలు యాంకరింగ్ చేసుకోవచ్చు.



కాసరపు సత్తిరాజు
బోయివీధి, భీమిలి

వలల మరమ్మతులకు షెడ్లు

ఈ సెంటర్‌లో వలల మరమ్మతులకు వీలుగా షెడ్లు నిర్మాణం చేపట్టనున్నారు. తెచ్చిన చేపలను ఎండలో, చెట్ల కింద అమ్మే పరిస్థితి ఇక నుంచి ఉండదు. నీడ పాటున చేపలు అమ్మేందుకు అనుగుణంగా సదుపాయాలు కల్పిస్తారు.



బి.ఎల్లాజి,
బోయివీధి, భీమిలి

నేరాలు ఘోరాలు

మేఘాద్రిలో మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-పెందుర్తి : మేఘాద్రి రిజర్వాయర్‌లో మంగళవారం మృతదేహం లభ్యమైంది. డాము వద్ద ఉన్న ఆధార్, బండి నెంబర్ ఆధారంగా స్థానికులు అతన్ని బాజీ జంక్షన్ ప్రాంతానికి చెందిన యాగటి హేమంత్ కుమార్ (38)గా గుర్తించి ఇంటికి సమాచారం అందించారు. భార్య భారతి పెందుర్తి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు పరిశీలించారు. కుటుంబ గొడవలతో భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని ఆత్మ హత్య చేసుకున్నాడా, లేక కాలు జారి పడిపోయాడా అన్నది దర్యాప్తులో తేలాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కెజిహెచ్‌కు తరలించారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-గొలుగొండ : మేజర్ పంచాయతీ ఏఎల్ పురానికి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మద్యం మానేయమని భార్య మందలించిందని మనస్తాపంతో గడ్డిమందు తాగి ఈ దారుణానికి ఒడిగట్టాడు. ఈ మేరకు కేడీపేట ఎస్ఐ ఉపేంద్ర తెలిపిన వివరాలివి. స్థానిక హైస్కూల్ వెనుక బిసి కాలనీలో నివాసముంటున్న సరుకుండు మర్రిబాబు (49) మద్యానికి బానిసై, అనారోగ్యం బారిన పడ్డారు. మరోవైపు రెండవ కుమార్తె వివాహం దగ్గరపడడంతో మద్యం తాగడం మానేయమని భార్య సత్యవతి తరచూ మందలించేది. దీంతో మనస్తాపానికి గురైన మర్రిబాబు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు కేడి పేట పిహెచ్‌సికి తరలించారు. పరిస్థితి విషమించడంతో విశాఖపట్నం కెజిహెచ్‌లో చేర్పించగా, చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించి మరణించాడు. కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్‌టిసి బస్ డ్రైవర్ హఠాన్మరణం

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్ : నర్సీపట్నం డిపోకు చెందిన ఆర్‌టిసి డ్రైవర్ డి.ఎ.రావు మంగళవారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందారు. నర్సీపట్నం ఆర్‌టిసి డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఆయన, మంగళవారం ఉదయం డిపోకు వచ్చి, తన ఆరోగ్యం బాగాలేదని, అస్వస్థతగా ఉన్నందున సెలవు ఇవ్వాలని అభ్యర్థించి సెలవు పెట్టారు. చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లగా, అక్కడ వైద్యులు పరీక్షించేలోగానే కుప్పకూలిపోయి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. ఆర్‌టిసి డ్రైవర్ డి.ఎ.రావు హఠాన్మరణంపై కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తుండగా, తోటి ఉద్యోగులు విస్మయానికి గురై, సంతాపం వ్యక్తం చేశారు.


ఎన్.జనార్ధనరావు (అధ్యక్షులు)


నమ్మి సూరిబాబు (కార్యదర్శి)

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బార్ అసోసియేషన్ సమావేశ మందిరంలో మంగళవారం ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షులుగా ఎన్.జనార్ధనరావు, కార్యదర్శిగా నమ్మి సూరిబాబు, ఉపాధ్యక్షులుగా కె.మంజుల, కోశాధికారిగా మమ్మిడిశెట్టి సునీల్, సహాయ కార్యదర్శిగా బోర సూర్యప్రకాష్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా బి.అప్పలరాజు, వి.అరుణకుమారి, వై.నరసింగరావు ఎన్నికయ్యారు. వీరిని బార్ అసోసియేషన్ సమావేశ మందిరంలో సీనియర్ న్యాయవాదులు గౌతమ్, పోలిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శి, ముగ్గురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఉన్నారు

లో-వోల్టేజ్ సమస్యపై వినతి

ప్రజాశక్తి - ఆరిలోవ : విద్యుత్ లో-వోల్టేజ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ 10వ వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీరాజశేఖర్ మంగళవారం స్థానిక విద్యుత్ కార్యనిర్వాహక ఇంజినీరుకు వినతిపత్రం అందజేశారు. 10వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రజలు గత కొంత కాలంగా విద్యుత్ లో-వోల్టేజ్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. లో-వోల్టేజీ కారణంగా తరచూ విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతోందని, వేసవి తీవ్రతతో వృద్ధులు, చంటి పిల్లలు, రోగులు ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈఈని కలిసిన వారిలో టిడిపి నాయకులు అప్పారావు, చిన్న ఉన్నారు.

లింగన్నపేటలో 'ఇదేమి ఖర్మ'

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని బుద్ధివలస పంచాయతీ లింగన్నపేటలో 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని మండల టిడిపి అధ్యక్షులు కోరాడ రమణ ఆధ్వర్యాన నిర్వహించారు. ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలపై ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. నిత్యావసర సరుకులు, గ్యాస్, పెట్రోల్ ధరల పెంపుపై వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కె.దామోదరరావు, కురిమిన లీలావతి, పైల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇంటర్ సబ్జెక్టు పోస్టులు బోధించేందుకు లెక్చరర్లుగా స్కూల్ అసిస్టెంట్ల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. ఇంటర్ తెలుగు, ఇంగ్లీష్, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జంతు శాస్త్రం, సివిక్స్, ఎకనామిక్స్, కామర్స్ లెక్చరర్ల పోస్టులకు గాను ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు పాఠశాల ప్రధానోపాధ్యాయులు లేదా మండల విద్యాశాఖాధికారిచే ధ్రువీకరణ చేయించి జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అందించాలని కోరారు. దరఖాస్తుతో పాటు అర్హత, సీనియారిటీ ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని తెలిపారు. దరఖాస్తులు జిల్లా విద్యాశాఖాధికారి వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు.

రైతులందరికీ న్యాయం చేస్తాం : ముత్తంశెట్టి

ప్రజాశక్తి-పద్మనాభం : రైతులందరికీ న్యాయం చేస్తామని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తునివలస పంచాయతీ పరిధి సర్వాపురం గ్రామంలో ల్యాండ్ పూలింగ్‌లో భూములిచ్చిన రైతులు 95 మందికి ఎమ్మెల్యే పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదలందరికీ ఇళ్ల ఇచ్చేందుకు ల్యాండ్‌పూలింగ్ ద్వారా భూములు సేకరించినట్లు తెలిపారు. ఈ పట్టాలను ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ చేసి రైతులకు ఇస్తుందన్నారు. దీని విలువ రూ.5 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. విశాఖపట్నం పరిపాలన రాజధాని అవుతుందని, భూములకు విలువ ఇంకా పెరుగుతుందని చెప్పారు. ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు, ప్రజా ప్రతినిధులు పనిచేయాలని కోరారు. తునివలస పంచాయతీ పరిధిలో 560 కుటుంబాలకు 23 రకాల పథకాల ద్వారా రూ.48.80 కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ గ్రామంలో రూ.1.20 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. అభివృద్ధి జరగలేదని తెలుగుదేశం పార్టీ నాయకులు సెల్ఫీలు తీసి చూపిస్తున్నారని, ఎవరి టైమ్‌లో ఎంత అభివృద్ధి జరిగిందో బహిరంగ చర్చకు వస్తే తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఈ కార్యక్రమములో మండల ల్యాండ్ పూలింగ్ ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు, తహశీల్దార్ తోట శ్రీవల్లీ, సర్పంచ్ సుంకర పైడిరాజు, ఎంపిపి కె.రాంబాబు, జెడ్‌పిటిసి సుంకర గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు సన్మానం

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని తునివలస పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సర్పంచ్ సుంకర పైడిరాజును సర్వాపురం గ్రామంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మంగళవారం సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీనివాసరావును, మండల ల్యాండ్ పూలింగ్ ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావును, తహశీల్దార్ తోట శ్రీవల్లీని సర్పంచ్ సన్మానించారు.


సర్పంచ్ పైడిరాజు దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఎన్‌ఎస్‌టిఎల్‌లో నేషనల్ టెక్నాలజీ డే వేడుకలు

ప్రజాశక్తి -కరాస: ఎన్‌ఎస్‌టిఎల్‌లో జాతీయ సాంకేతిక దినోత్సవాలను మంగళవారం ప్రారంభించారు. ఈ నెల 11వ తేదీన జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా 9, 10 తేదీలలో ఎన్‌ఎస్‌టిఎల్ ఉత్పత్తుల ప్రదర్శన, మల్టీ మీడియా ప్రజెంటేషన్, ఇంటిగ్రేటెడ్ అప్రోచ్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ సస్టెనేబుల్ ఫ్యూచర్ అనే అంశంపై నమూనాల తయారీ పోటీలు నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా మంగళవారం ఎన్‌ఎస్‌టిఎల్ సంచాలకులు డాక్టర్ వై.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై ఓపెన్ హౌస్ ప్రారంభించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిట్లను తిలకించి వారు ప్రదర్శించిన వర్కింగ్ మోడల్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. వారిని భవిష్యత్తు ప్రపంచ స్థాయి శాస్త్రవేత్తలుగా అభివర్ణించారు. భారత నౌకాదళం కోసం ఎన్‌ఎస్‌టిఎల్ చేస్తున్న పరిశోధనల గురించి తెలుసుకోవడానికి కళాశాల, పాఠశాల విద్యార్థులు ఎగ్జిబిషన్‌ను సందర్శించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొత్తం పది పాఠశాలలు, 12 కళాశాలల నుంచి మొత్తం 91 నమూనాలు వచ్చాయని, వాటిలో 43 నమూనాలను ప్రదర్శనకు ఎంపికయ్యాయని తెలిపారు. విజేతలకు జాతీయ సాంకేతిక దినోత్సవం నాడు బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పివిఎస్.గణేష్‌కుమార్, కృష్ణకుమార్, ఇతర శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.


ఎన్‌ఎస్‌టిఎల్ ఉత్పత్తుల గురించి విద్యార్థులకు వివరిస్తున్న శాస్త్రవేత్తలు


సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న కార్మికులు

మేడే వారోత్సవాలు

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 96వ వార్డు పరిధి సిఐటియు కార్యాలయంలో మేడే వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జోన్ కార్యదర్శి బి.రమణి మాట్లాడుతూ, మోడీ ప్రభుత్వం అదాని, అంబానీలకు అండగా ఉండి కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తోందని విమర్శించారు. లేబర్ కోడ్ చట్టాలను కుదించడం వల్ల కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కార్మికులంతా ఐక్యంతో ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రజానాట్య మండలి ఆధ్వర్యాన నిర్వహించిన ఆటపాటలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు మౌలాలి, సిఐటియు నాయకులు అప్పలనాయుడు ఐద్వా నాయకులు రజిని, ఈశ్వరరావు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.


కార్మికునికి నిత్యావసరాలు అందిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

గాయపడిన కార్మికునికి నిత్యావసరాలు

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 76వ వార్డు పరిధి రామచంద్రనగర్ గ్రామానికి చెందిన లొల్ల శంకరరావు భవన నిర్మాణ పనులు చేస్తూ పరంజా నుంచి కిందికి జారీ పడిపోవడంతో నడుముకు దెబ్బతగిలి గాయాలపాలయ్యాడు. ఉపాధి కోల్పోయిన ఆయన కుటుంబానికి భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు నెల రోజులకు సరిపడే నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు గాజువాక జోన్ అధ్యక్షులు డి.రమణ మాట్లాడుతూ, భవనిర్మాణ కార్మిక సంఘం ఏర్పడిన తర్వాత ఎంతోమంది కార్మికులకు మేమున్నామంటూ భరోసా ఇస్తూ ముందుకు సాగడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అర్జునరావు, త్రినాథరావు, రాజారావు, రామ్మూర్తి, మోహన్, సింహాచలం, భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా తగ్గించాలని 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం కోరారు. మంగళవారం వార్డు పరిధి తిరుమలనగర్‌లో జరిగిన స్వచ్ఛసర్వేక్షణ్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి ఎంతో నష్టమని, పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. తడి పొడి చెత్త వేర్వేరుగా పారిశుధ్య కార్మికులకు అందజేయాలని, ఇంకుడు గోతులు ప్రతి ఇంట్లో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నార సంచులు వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఎంహెచ్ఒ కిరణ్‌కుమార్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, తిరుమలనగర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గమాంబ పండుగ

ప్రజాశక్తి -కంచరపాలెం : జీవీఎంసీ 56వ వార్డు పరిధి గొల్ల కంచరపాలెం గ్రామ దేవత దుర్గమాంబ అమ్మవారి పండుగను గ్రామ అధ్యక్షులు పల్లా సత్యనారాయణ ఆధ్వర్యాన మంగళవారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నాలుగు గంటలకు అమ్మవారికి ప్రథమ పూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించడంతో గ్రామస్తులతోపాటు పరిసర గ్రామాల భక్తులు పొల్గొని పసుపు, కుంకుమ, గాజులు, చీర సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎండ తీవ్రత కారణంగా గ్రామ కమిటీతోపాటు పలు స్వచ్ఛంద సంస్థలు పులిహోర, పరమాన్నం, మజ్జిగ, శీతల పానీయాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ హరి వెంకటకుమారి, డిప్యూటీ మేయర్లు కట్టమూరి సతీష్, జియ్యాని శ్రీధర్, పశ్చిమ, ఉత్తర నియోజకవర్గాల వైసిపి సమన్వయకర్తలు ఆడారి ఆనంద్ కుమార్, కెకె.రాజు, ఎమ్మెల్యే పి.గణబాబు, కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, కాయిత వెంకటలక్ష్మి రత్నాకర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గాజువాకలో ప్రధాన సమస్యలకు పరిష్కారం

ఎమ్మెల్యే నాగిరెడ్డి

ప్రజాశక్తి - గాజువాక : గాజువాక నియోజకవర్గంలో ప్రధాన సమస్యలకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పరిష్కారం చూపారని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తెలిపారు. మంగళవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గాజువాక హౌస్ కమిటీ, ఏపిఐఐసి భూములు, కర్ణవానిపాలెం భూసమస్య, ఫార్మాసిటీ పట్టాల సమస్య తదితరాలు పరిష్కారమయ్యాయని చెప్పారు. గాజువాక హౌస్ కమిటీ సంబంధించి 2018లో తెలుగుదేశం ప్రభుత్వం తప్పుడు పట్టాలిచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. దానిపై జగన్మోహన్‌రెడ్డి జిఒ 71 తెచ్చి పరిష్కారానికి చర్యలు చేపట్టారని తెలిపారు. ఆ భూములకు రిజిస్ట్రేషన్లు, రుణాలు, క్రయవిక్రయాలకు అనుమతి ఉంటుందన్నారు. ఫార్మాసిటీ కాలనీ నిర్వాసితుల మ్యారేజ్ మేజర్స్‌కు పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అగనంపూడి కర్ణవానిపాలెం నిర్వాసితులకు స్టీల్‌ప్లాంట్ పునరావాసం కల్పించలేదని, 119 లబ్ధిదారులకు త్వరలో పట్టాలు పంపిణీ చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. దశాబ్దాలుగా తీరని సమస్యలకు ముఖ్యమంత్రి పరిష్కారం చూపారన్నారు. ఈ కార్యక్రమంలో గాజువాక ఇంచార్జ్ తిప్పల దేవన్ రెడ్డి, తిప్పల వంశీరెడ్డి, రాజాన రామారావు, మార్టుపూడి పరదేశి, పల్లా చినతల్లి, యువశ్రీ పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే గణబాబు జన్మదిన వేడుకలు


ఎమ్మెల్యే గణబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి -గోపాలపట్నం : విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు జన్మదిన వేడుకలను తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో ఎమ్మెల్యే గణబాబు పేరిట వన్డే బాక్సింగ్ టోర్నమెంట్‌ను ఏర్పాటుచేశారు. 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను గణబాబు సత్కరించారు. ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, కార్పొరేటర్లు దాడి వెంకటరమేష్, పీలా శ్రీనివాసరావు, బొమ్మిడి రమణ, గల్లా చిన్న, రాపర్తి కన్నా, పీవీ నరసింహారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు నందవరపు సోములు, బొడ్డేటి విజయ్‌కుమార్, పొలిమేర సీతారాం, అధికారులు కార్యకర్తలు ఉన్నారు.

నాయీ బ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి- గోపాలపట్నం : స్థానిక కుమారి కల్యాణ మండపంలో విశాఖ నగర నాయీ బ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనం వైసిపి ఆధ్వర్యాన నిర్వహించారు. నాయీ బ్రాహ్మణులకు బార్బర్ షాప్‌నకు సంబంధించిన పనిముట్లను వైసిపి పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ అందించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నాయీ బ్రాహ్మణులకు ఎంతో గుర్తింపునిచ్చారని తెలిపారు. వారికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ పశ్చిమ నియోజకవర్గం వైసిపి పరిశీలకుడు రెహమాన్, డిప్యూటీ మేయర్ శ్రీధర్, కో-ఆప్షన్ సభ్యులు బెహరా భాస్కరరావు, ఏపీ నాయీ బ్రాహ్మణ గౌరవాధ్యక్షులు ఆరిపాక పెంటారావు, ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెంపటాపు నూకరాజు, వైసిపి నాయకులు గునిశెట్టి శ్రీనివాసరావు, గొర్ల అప్పలస్వామినాయుడు, దొడ్డి కిరణ్, చుక్కా ప్రసాద్‌రెడ్డి, ఆడారి శ్రీనివాసు, నమ్మి శ్రీను, కార్యకర్తలు పాల్గొన్నారు.


నాయి బ్రాహ్మణులకు బార్బర్ కిట్లు పంపిణీ చేస్తున్న ఆనంద్ కుమార్

అర్బన్ తహశీల్దార్‌కు అభినందనలు

ప్రజాశక్తి-సీతమ్మధార : సీతమ్మధార అర్బన్ తహశీల్దార్ కార్యాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన తహశీల్దార్ పి.శ్యామ్‌ప్రసాద్‌ను ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు అభినందించారు. కెకె.రాజు మంగళవారం అర్బన్ తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయం లోపల, బయట అందమైన రంగులు, ఆకట్టుకునే చిత్రాలతో తీర్చిదిద్దడాన్ని చూసి సంతోషం వ్యక్తంచేశారు. ప్రభుత్వ కార్యాలయాన్ని ఇంత అందంగా తీర్చిదిద్దేందుకు కృషి చేసిన తహశీల్దార్ శ్యామ్‌ప్రసాద్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గెడ్డలో చెత్త

ప్రజాశక్తి-సీతమ్మధార : జీవీఎంసీ 43వ వార్డు పరిధి కర్రివాని బ్రిడ్జి గెడ్డలో చెత్త పేరుకుపోయింది. తీవ్ర దుర్వాసన, దోమలు వ్యాప్తి చెందడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విష జ్వరాలకు గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు చొరవ చూపి గెడ్డలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని కోరుతున్నారు.

12న వికలాంగులకు జాబ్ మేళా

ప్రజాశక్తి -కంచరపాలెం : జిల్లా ఉపాధి కల్పనాధికారులు (క్లరికల్) (టెక్నికల్), వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సంయుక్త ఆధ్వర్యాన కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 12వ తేదీన ఉదయం 10 గంటలకు వికలాంగులకు ప్రత్యేకంగా మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళా నందు ఇతర నిరుద్యోగ అభ్యర్థులు కూడా పాల్గొనవచ్చని పేర్కొన్నారు. విశాఖపట్నంలోని పలు సంస్థల్లో వివిధ పోస్టుల భర్తీకి జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫ్లిప్‌కార్ట్ (హైదరాబాద్), వింధ్యబిఇన్ఫో మీడియా ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్/బెంగళూరు, హీరావత్స్ (విశాఖపట్నం), అస్ లిమిటెడ్ షాపింగ్ మాల్ విశాఖపట్నం, అన్ని లొకేషన్స్, పెగా సిస్టమ్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీ (హైదరాబాద్), పర్ క్యాప్ సాఫ్ట్‌వేర్ కంపెనీ (హైదరాబాద్), వినిస్ (విశాఖపట్నం), కెవిఫ్‌సి ఆంధ్ర ఏరియా, హైదరాబాద్, పాల్ ప్లాస్టిక్ మ్యానుఫ్యాక్చరింగ్ (విశాఖపట్నం), బిగ్ బాస్కెట్ (విశాఖపట్నం), సీనర్జిస్ ఇంగ్రేడియంట్ ప్రైవేట్ లిమిటెడ్, (పరవాడ ఫార్మసిటీ విశాఖపట్నం), పి అండ్ జి (సున్నదీప్) (విశాఖపట్నం), ఎస్బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ (విశాఖపట్నం), బిగ్ సి మొబైల్స్ (విశాఖపట్నం), సంస్థలలో వేర్ హౌస్ అసోసియేట్స్, టెలికాలర్ (తెలుగు), పిక్కర్స్ అండ్ ప్యాకర్స్, సెక్యూరిటీ గార్డ్స్, కస్టమర్ సపోర్ట్ అసోసియేట్స్, సాఫ్ట్ ఇంజనీర్స్, కస్టమర్ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్, సూయింగ్ ఆపరేటర్స్, ట్రైనీ కెమిస్ట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్ అండ్ వేర్ హౌస్ అసోసియేట్స్, సేల్స్ ఆఫీసర్, బ్రాంచ్ మేనేజర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఎంపిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పదవ తరగతి, ఇంటర్, ఏదైనా డిగ్రీ, బీఎస్సీ కెమిస్ట్రీ, ఏదేనీ బీటెక్ విద్యార్హతలు గలవారు ఉద్యోగాన్ని బట్టి 18 నుంచి 45 మధ్య వయస్సు కలిగిన వారు అర్హులని తెలిపారు. పోస్టుల ఆధారంగా రూ.10 వేల నుంచి సుమారు రూ.30 వేల వరకు జీతాలు ఉంటాయని వివరించారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ వివరాలను ముందుగా ncs.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు.

'జగనన్నకు చెబుదాం'తో కీలక సమస్యల పరిష్కారం

అనకాపల్లి జిల్లా ప్రత్యేకాధికారి నివాస్



వర్చువల్ విధానంలో ప్రారంభోత్సవాన్ని తిలకిస్తున్న ప్రత్యేకాధికారి నివాస్, కలెక్టర్ రవి, ఎస్‌పి మురళీకృష్ణ, జెసి, తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి

జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా కీలక సమస్యల పరిష్కారమవుతాయని జిల్లా ప్రత్యేక అధికారి జె.నివాస్ అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వర్చువల్ విధానంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం వెబ్‌సైట్ ప్రారంభ కార్యక్రమంలో అనకాపల్లి కలెక్టరేట్ నుంచి జిల్లా ప్రత్యేకాధికారి జె.నివాస్, జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, అడిషనల్ ఎస్పీ విజయ భాస్కర్, జిల్లా రెవెన్యూ అధికారికి వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో అనకాపల్లి ప్రత్యేక అధికారి నివాస్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమం టోల్ ఫ్రీ నెంబర్ 1902పై క్షుణ్ణమైన అవగాహన కల్పించాలన్నారు. స్పందన గ్రీవెన్స్‌కు మెరుగులు దిద్దుతూ సమస్యలకు నాణ్యమైన, సత్వర పరిష్కారం కొరకే ఈ జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రారంభించినట్లు చెప్పారు. స్పందన ఫిర్యాదులకు ఇచ్చే జవాబులలో మరింత నాణ్యత పెరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా రెవెన్యూ, పోలీస్, గ్రామపంచాయతీ శాఖలలో ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని వీలైనంత త్వరగా స్పష్టంగా పరిష్కరించినట్లయితే సంతృప్త స్థాయి మరింత పెరుగుతుందని తెలిపారు.

నర్సీపట్నం టౌన్/ రూరల్ : జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రారంభోత్సవాన్ని నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్‌డిఒ హెచ్‌వి జయరాం, డిఎస్‌పి కె ప్రవీణ్ కుమార్ తమ సిబ్బందితో తిలకించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రసంగాన్ని ఆద్యంతం శ్రద్ధగా విన్నారు. అనంతరం ఆర్‌డిఒ జయరాం మాట్లాడుతూ, జిల్లా, డివిజన్ స్థాయిలో వివిధ కారణాల వల్ల పరిష్కారానికి నోచుకోని కీలక సమస్యలు జగనన్నకు చెబుదాం ద్వారా పరిష్కారమవుతాయన్నారు. దీనికోసం గ్రీవెన్స్‌కు 1902 టోల్ ఫ్రీ నెంబర్ ప్రభుత్వం కేటాయించిందన్నారు. కార్యక్రమంలో పట్టణ సిఐ నమ్మి గణేష్, ఎస్‌ఐలు గోవిందరావు, రామారావు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపిపి సుర్ల రాజేశ్వరి, ఎంపిడిఒ జయమాధవి, వైస్ ఎంపిపి ఇన్నం రత్నం తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల : జగనన్నకు చెబుతాం కార్యక్రమం ప్రారంభోత్సవాన్ని మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిడిఒ చంద్రశేఖర్, ఎస్‌ఐ నారాయణరావు సహా పలువురు అధికారులు వీక్షించారు, కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ప్రేమ్ సాగర్, పిఆర్ జెఇ వర్మ, హౌసింగ్ ఇంజనీర్ జగదీశ్వరరావు, ఉపాధి ఎపిఒ గంగు నాయుడు పాల్గొన్నారు.

కశింకోట : తాడేపల్లి నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మండలంలోని ఉగ్గినపాలెం రైతు భరోసా కేంద్రంలో స్థానికులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కలగా లక్ష్మి, గ్రామ సర్పంచ్ కలగా గున్నయ్య నాయుడు, పాలకవర్గ సభ్యులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, డ్వాక్రా మహిళలు, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది, గ్రామ పెద్దలు, గృహసారథులు పాల్గొన్నారు

విశాఖలో...

ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మంగళవారం ఉదయం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభించిన నేపథ్యంలో జిల్లా స్థాయి అధికారులంతా విశాఖ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్సు హాల్ నుంచి ఆ కార్యకమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున, పోలీసు కమిషనర్ సిఎం త్రివిక్రమ్ వర్మ, జివిఎంసి కమిషనర్ సాయి కాంత్ వర్మ, ఎపిఐఐసి ఎమ్‌డి ప్రవీణ్ కుమార్, నగర్ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, శాసన సభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్, తిప్పల నాగిరెడ్డి, నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె.రాజు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.




విఆర్‌ఒలకు రికార్డులు అందజేస్తున్న సబ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు

భూముల రిజిస్ట్రేషన్లపై అవగాహన

ప్రజాశక్తి- కె.కోటపాడు

భూముల రిజిస్ట్రేషన్లు, రికార్డుల నిర్వహణపై గ్రామ సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు మంగళవారం సబ్ రిజిస్ట్రార్ బంగారు వెంకటేశ్వరరావు అవగాహన కల్పించారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో భూముల రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినందున ఆయా గ్రామాలకు చెందిన రిజిస్ట్రేషన్లు నిలిపివేశామని సబ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ నేపథ్యంలో దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల్లోని తొమ్మిది గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న భూముల రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రీ సర్వే గ్రామాల్లో సర్వే నెంబర్ల స్థానంలో ఎల్పిఎం నెంబర్లతో రిజిస్ట్రేషన్లు చేయటానికి సచివాలయ కార్యదర్శులకు సరైన అవగాహన లేదు. దీంతో దేవరాపల్లి మండల చిన సోంపురం, ఎన్.గజపతినగరం, కె.కోటపాడు మండలం ఎ.భీమవరం, పోతన వలస అగ్రహారం, సూరెడ్డిపాలెం, డి.అగ్రహారం, రొంగల నాయుడుపాలెం, కేజే పురం గ్రామ సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు సబ్ రిజిస్ట్రార్ బంగారు వెంకటేశ్వరరావు మంగళవారం అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల రికార్డులు కార్యదర్శులకు అప్పగించారు.



ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం బూడి

గ్రామాల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని వేచలం పంచాయతీ పరిధిలోని పలు కల్లాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు మంగళవారం నిర్వహించారు. కల్లాల వద్దకు ద్విచక్ర వాహనంపై వెళ్లి రైతులను పలకరిస్తూ పథకాలు వివరిస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కల్లాల్లో వారికి కావాల్సిన మంచిని నీరు, విద్యుత్, రోడ్డు సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. జగన్నాధపురం కాలువపై స్లబ్ కల్వర్టు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కల్లాలలో నీటి అవసరాల నిమిత్తం 20 వేల లీటర్ల నీటి సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి సత్యం, వైసీపీ మండల అధ్యక్షులు బూరె బాబురావు, ఎంపీడీవో సుబ్బలక్ష్మి, సర్పంచ్ నాగిరెడ్డి శరరి నాయుడు, అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని వెన్నలపాలెం పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నుండి అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైసిపి రాష్ట్ర సీఈసీ సభ్యులు పైల శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు, పెందుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అన్నంరెడ్డి అజయ్ రాజ్, మండల అధ్యక్షులు కోన రామరావు, స్థానిక సర్పంచ్ వెన్నెల అప్పారావు, ఎంపీటీసీ వెన్నెల అరుణ కుమారి, వైసిపి నాయకులు వెన్నెల సన్యాసిరావు, పైల అప్పలనాయుడు, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

ఆగివున్న ఆటోను ఢీకొన్న సిమెంట్ ట్యాంకర్

-ఇద్దరు దుర్మరణం
- మరో ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట ఆర్టీసీ బస్టాండ్‌కు ఎదురుగా జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం ఆగివున్న ఆటోని రామ్‌కో సిమెంట్ కంపెనీకి చెందిన ట్యాంకర్ ఢీకొనడంతో ఆటో డ్రైవర్, ఒక మహిళ దుర్మరణం చెందారు. మరో ఆరుగురు గాయపడ్డారు. కశింకోట అదనపు ఎస్‌ఐ నాగేశ్వరరావు కథనం ప్రకారం... బయ్యవరం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ శనివాడ తలుపులు రాజు(32) మంగళవారం తెల్లవారుజామున తమ గ్రామానికి చెందిన కూరగాయల రైతులను ఎక్కించుకొని అనకాపల్లి మార్కెట్‌కు బయలుదేరాడు. కశింకోట ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా జాతీయ రహదారిపై ప్రయాణికులను ఎక్కించుకునేందుకు ఆటో ఆపాడు. ఈ సమయంలో రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి బయలుదేరిన సిమెంట్ ట్యాంకర్ వేగంగా వచ్చి ఆగివున్న ఆటోను వెనుక నుండి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోపక్కనున్న ఆటో డ్రైవర్ తలుపులరాజుతో పాటు కశింకోటకు ఇంద్రాకాలనీకి చెందిన మునగపాక లక్ష్మి (52) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఆటోలో వున్న బయ్యవరం గ్రామానికి చెందిన చాపరెడ్డి సత్యవతి, మామిడి లక్ష్మి, గుర్రం దుర్గ నాయుడు, కశింకోటకు చెందిన సన్నాడ రాజు, బొడ్డేడ ధనలక్ష్మి, హేమంత్ గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి క్షతగాత్రులను 108 వాహనంలో అనకాపల్లి ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో మృతి చెందిన మునగపాక లక్ష్మి కూరగాయల వ్యాపారి. కూరగాయలు కొనుగోలు నిమిత్తం అనకాపల్లి మార్కెట్‌కు వెళ్లేందుకు ఆటో ఎక్కుతుండగా, ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఇది ఇలా ఉండగా, ప్రమాద స్థలం వద్ద జనం గుమిగూడుతుండగా అదే సమయంలో మరో లారీ వెనకనుండి వచ్చి ప్రమాదానికి కారణమైన సిమెంట్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాలేదు. కశింకోట అదనపు ఎస్‌ఐ నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటనా స్థలంలో బోల్తా పడిన ఆటో, లక్ష్మి మృతదేహం



తైక్వాండో శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

తైక్వాండో శిక్షణకు విశేష స్పందన

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది హైస్కూల్ గ్రౌండ్‌లో అమ్మ హెల్పింగ్ హార్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత తైక్వాండో శిక్షణకు విశేష స్పందన లభిస్తుంది. ప్రతిరోజు ఉదయం 5 నుండి 7 గంటల వరకు నిర్వహిస్తున్న ఈ శిక్షణకు పరిసర ప్రాంతాల నుండి సుమారు 500 మందికి పైగా చిన్నారులు హాజరవుతున్నారు. కోచ్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఈనెల 15 వరకు ఈ శిక్షణ కొనసాగుతుంది. ఈ శిక్షణ శిబిరంలో వైద్య సిబ్బందిని సిద్ధంగా ఉంచారు. తాగునీటి సౌకర్యం కల్పించారు.

పౌష్టికాహారంతో రక్తహీనతను నివారించవచ్చు

ప్రజాశక్తి- సబ్బవరం : పౌష్టికాహారంతో రక్తహీనతను నివారించవచ్చునని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ హేమంత్ అన్నారు. మండలంలోని నారపాడులో మంగళవారం జరిగిన ఫ్యామిలీ పిజీషియన్ కార్యక్రమాన్ని ఆయన సందర్శించి రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన కిశోర బాలికలకు పౌష్టికాహారం, రక్తహీనత నివారణపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎక్కువ మంది బాలికలు రక్తహీనతతో బాధపడుతున్నారని, దీని నివారణకు వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ చక్రవర్తి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డిఎంహెచ్‌ఒ డాక్టర్ హేమంత్

ఘనంగా కార్పొరేటర్ సునీత జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- అనకాపల్లి : జివిఎంసి 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత జన్మదిన వేడుకలు మంగళవారం స్థానిక సత్యసాయి మందిరంలో ఘనంగా నిర్వహించారు. అభిమానులు, పార్టీ నాయకులు ముందుగా కేకును కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. పేదలకు మధ్యాహ్న భోజనాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల శ్రీనివాస్, వైఎన్ వెంకటేశ్వరరావు, కర్రి భాస్కరరావు, డొంక సత్తిబాబు, శివ, పేలూరు కళ్యాణ్, మందిర నిర్వాహకులు పాల్గొన్నారు.

మైలాన్ యూనిట్-9లో కార్మికుడు మృతి

రూ.5.50 లక్షల పరిహారం చెల్లింపునకు యాజమాన్యం అంగీకారం

ప్రజాశక్తి -పరవాడ : పరవాడ ఫార్మసిటీలోని మైలాన్ యూనిట్-9లో మంగళవారం విధులు నిర్వహిస్తున్న కార్మికుడు ఎం.శ్రీను (42) మృతి చెందాడు. కంపెనీలో విధులు నిర్వహిస్తుండగా, తీవ్ర అస్వస్థకు గురైన శ్రీనును విశాఖలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందాడు. వెంటనే కంపెనీ యాజమాన్య ప్రతినిధులు శ్రీను మృతదేహాన్ని ఆయన స్వగ్రామం అనకాపల్లి జిల్లా మునగపాక మండలం, నారాయణపాలెం గ్రామానికి తరలించారు.

దీనిపై కుటుంబ సభ్యులు, నారాయణపాలెం ఎంపీటీసీ ఎల్లప్ప నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు, ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ తదితరులు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో యాజమాన్య ప్రతినిధి అరవింద్, వారితో చర్చలు జరిపారు. మృతుని కుటుంబానికి రూ.5.50 లక్షలు నష్టపరిహారం చెల్లించడానికి, రూ.4 లక్షలు గ్రాడ్యుటీ, తదితర చట్ట ప్రకారం రావలసినవి ఇవ్వడానికి, మృతుని భార్యకు పరిశ్రమలో ఉపాధి కల్పించడానికి, ప్రతి నెలా రూ.15వేలు పింఛను చెల్లించడానికి యాజమాన్యం అంగీకరించింది. దహన సంస్కారాలు ఖర్చులు నిమిత్తం వెంటనే రూ.50వేలు శ్రీను కుటుంబానికి అందజేశారు. ఈ విషయంపై కేసు నమోదు చేశారా? అని పరవాడ సిఐ పి.ఈశ్వరరావును ప్రజాశక్తి వివరణ కోరగా, తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు. ఫిర్యాదు లేనిదే తాము ఏమి చేయలేమని చెప్పారు.



మృతుని భార్యకు ఒప్పంద పత్రం అందజేస్తున్న దృశ్యం



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, వైసిపి నేతలు

అపరిష్కృత సమస్యలపై కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి పరవాడ : పరవాడ మండలంలోని వివిధ అపరిష్కృత సమస్యలపై పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యాన వైసిపి నాయకులు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రవి పఠాన్‌శెట్టిని కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలోని రావాడ, తానాం, భరణికం పంచాయతీల్లో జగనన్న లేఅవుట్‌కు సంబంధించి స్థల సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. అంధుల ఫెడరేషన్‌కు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి, వాసవి కన్యకామరమేశ్వరి ఆలయ నిర్మాణానికి స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. గొర్లివానిపాలెం పంచాయతీలో 1500 రేషన్ కార్డులు ఉన్నందున రేషన్ డిపోను విభజించాలని, రావాడ రెవెన్యూ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమి, ఫారెస్ట్ భూమికి ఆ రెండు శాఖలు కలిసి జాయింట్ సర్వే నిర్వహహించి, ఆ భూమిని ప్రజల అవసరాలకు వినియోగించాలని కోరారు. జగనన్న ఇళ్ల కోసం దరఖాస్తు చేసిన వారందరికీ 90 రోజుల్లోగా స్థలాలు కేటాయించి ఇళ్ళు మంజూరు చేయాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వైసిపి రాష్ట్ర సీఈసీ సభ్యులు పైల శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షులు కోన రామరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, భరణికం సర్పంచ్ పెదిశెట్టి పూజ శేఖర్, పి.బోనంగి సర్పంచ్ బండారు కల్పన రాజశేఖర్ ఉన్నారు.

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-చోడవరం : మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ, రెజ్లింగ్ ఫెడరేషన్ చీఫ్ బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకోవాలని ఒపిఆర్‌డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె గౌరీ శంకర్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పేదరికంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొని ఫెడరేషన్‌లో చోటు దక్కించుకొని విదేశాల్లో మన దేశ ఖ్యాతిని నిలబెట్టి, మన జెండాను ఎగురవేసిన మహిళా క్రీడాకారులపై బిజెపి అనుసరిస్తున్న తీరు సిగ్గుచేటని విమర్శించారు. లక్ష మంది ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఒక ఎంపీ మహిళల పట్ల అది దేశానికి గౌరవం తెచ్చిన మహిళా క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడడంతో ప్రపంచ దేశాల్లో మనం తలదించుకోవలసి వస్తుందని పేర్కొన్నారు. దేశ ప్రజలందరూ ఎంపీకి శిక్ష పడేలా ఒత్తిడి చేయాలని కోరారు.

వయోవృద్ధుల కమిటీలో ఎన్‌జిఒలకు అవకాశం

ప్రజాశక్తి-అనకాపల్లి : తల్లిదండ్రుల పోషణ, రక్షణ చట్టం 2007 రూల్ నెంబర్ 23ను అనుసరించి ఏర్పాటు చేయనున్న జిల్లా వయోవృద్ధుల సంక్షేమ కమిటీలో ఆసక్తి ఉన్న ఎన్జీవోలకు అవకాశం కల్పించనున్నట్టు విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జివిబి జగదీష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నూతనంగా ఏర్పడిన అనకాపల్లి జిల్లాలో ఏర్పాటు చేయనున్న ఈ కమిటీలో ఏడుగురు జిల్లా స్థాయి అధికారులు, వయోవృద్ధుల సంక్షేమం కోసం పనిచేస్తున్న ఎన్జీవోల్లో ఆరుగురు సభ్యులను తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గలవారు వారం రోజుల్లోగా తమ పేర్లను కలెక్టర్ కార్యాలయంలోని తమ ఆఫీసులో అందజేయాలని కోరారు. ఇతర వివరాలకు 9493291018 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

విద్యార్థుల అవసరాల మేరకు సాంకేతిక తోడ్పాటు

ప్రజాశక్తి-అనకాపల్లి : విద్యార్థుల భవిష్యత్తు సాంకేతిక అవసరాలకు అనుగుణంగా విద్యను అందించడం జరుగుతుందని డైట్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చల్ల నరసింహం అన్నారు. కళాశాలలో సోమ, మంగళవారాల్లో ఇంటర్నెట్ ఆఫ్ థింకింగ్ అంశంపై అవగాహన, శిక్షణ కార్యక్రమం జరిగింది. ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. కరస్పాండెంట్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ విద్యార్థులు కళాశాల అందిస్తున్న శిక్షణను, అవగాహన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైట్ ఐ ట్రిబుల్ ఈ స్టూడెంట్ బ్రాంచ్ కౌన్సిలర్ డాక్టర్ పి పూర్ణ ప్రియ, రిసోర్స్ పర్సన్ ఏఎస్ఎన్ వర్మ, స్టూడెంట్ బ్రాంచ్ కోఆర్డినేటర్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు

200 పని దినాలు, రూ.600 వేతనం కల్పించాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి

ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బిటి దొర డిమాండ్ చేశారు. మండలంలోని వాలాబు గిరిజన పంచాయతీ పరిధిలోని యాలం బయలు, రేగులబంద, సంతపాలం, తాటిపూడి వద్ద ఉపాధి హామీ పనులు ప్రదేశాలను మంగళవారం ఆయన సందర్శించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడే కూలీలు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఐదు వారాల బిల్లులను, జిల్లాలోని బకాయిలున్న రూ.60 కోట్లను వెంటనే విడుదల చేయాలని కోరారు. కొత్త జాబ్ కార్డులు ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్లలో కోత పెట్టడం దారుణమన్నారు. మండలంలోని ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల కూలీలు ఇబ్బంది పడుతున్నారని, టెంట్లు ఏర్పాటు చేయాలని, కూలీలకు సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరరావు, సింహాచలం, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

విస్సన్నపేట భూ కుంభకోణంపై

సిబిఐ దర్యాప్తు జరిపించాలని ధర్నా



ధర్నా చేస్తున్న జనసేన నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-అనకాపల్లి

కశింకోట మండలం విస్సన్నపేట భూములపై సిబిఐ దర్యాప్తు జరిపించాలని కోరుతూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ విస్సన్నపేట భూములపై క్షేత్ర స్థాయి పరిశీలన చేసి నేటికీ సరిగ్గా 3 నెలలైనా ఇప్పటివరకు అధికారులు ఆ అక్రమ లేఅవుట్‌పై చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. వీటిపై నివేదిక అందచేయాలని లోకాయుక్త ఆదేశించి 6 నెలలు గడుస్తున్నా అధికారులు వాయిదాలు కోరుతున్నారు తప్ప నివేదిక ఇవ్వడం లేదన్నారు. జనసేన చేపడుతున్న జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమం ద్వారా వైసిపి ప్రభుత్వంలో జరిగిన భారీ భూ కుంభకోణాలు, అక్రమాలపై ఫిర్యాదు చేస్తామని, ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే చర్యలు తీసుకోవాలని, సిబిఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు.

విస్సన్నపేట ఉదంతంపై ప్రభుత్వం కనీసం స్పందించలేదని, మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌పై ప్రేమో? లేదా ప్రభుత్వ పెద్దలకు వాటాలు ముట్టడమో? లోగుట్టు ఏమిటో అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శ్రీరామదాసు గోవింద, దూలం గోపి, తాడి రామకృష్ణ, మళ్ల శ్రీను, బర్నికాన రాము, అప్పికొండ గణేష్, జగదీష్, సీత, కనుబుడ్డి నాగేశ్వరరావు, కోన అప్పారావు, కరణం నాయుడు, మార్టూరు ప్రసాద్, కరణం రాము, పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-అనకాపల్లి : లింగ నిర్ధారణ పరీక్షలు చేసే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని అనకాపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి, డివిజనల్ ఎప్రోప్రియేట్ అథారిటీ చైర్మన్ చిన్నికృష్ణ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో పిసి అండ్ పిఎన్డిటి అమలుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 58 స్కానింగ్ సెంటర్లపై తరచుగా తనిఖీలు నిర్వహించాలన్నారు. సమాజంలో ఆడపిల్లల జనాభా తగ్గిపోతున్నందున స్త్రీ పురుష నిష్పత్తిలో తేడాలు వస్తున్నాయని దాని వలన ఎదురయ్యే సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్ష నిరోధ చట్టం గురించి, చట్టాన్ని అతిక్రమిస్తే కలిగే శిక్షల గురించి అందరికీ తెలియజేయాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయించారనే సమాచారం తెలిస్తే వెంటనే 102, 104 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేయాలన్నారు. ఏఎన్ఎం, ఆశా కార్యకర్తల ద్వారా అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ఎం.శారదాబాయి, గైనకాలజిస్ట్ డాక్టర్ విజయ్ కుమార్, లీగల్ అడ్వైజర్ డాక్టర్ హరిత, డిపిఆర్ఓ సాయిబాబా మహాలక్ష్మి, డెమో ఝాన్సీ రాణి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ సహకారంతో మండలంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని మండల పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలోని అక్కిరెడ్డిపాలెం గ్రామ సచివాలయం పరిధిలో మంగళవారం గ్రామపంచాయతీ నిధులు రూ.3 లక్షలతో డ్రైనేజీ నిర్మాణానికి ఆయన కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాలాపు శాంతి సూరప్పారావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

క్లాప్ డ్రైవర్లను ఆప్కాస్‌లో చేర్చాలని ఆందోళన

ప్రజాశక్తి- అనకాపల్లి : జీవీఎంసీ పరిధిలో పనిచేస్తున్న క్లాప్ మిత్ర డ్రైవర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్‌లో చేర్చాలని కోరుతూ మంగళవారం స్థానిక జీవీఎంసీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. వారికి ఏఐటీయూసీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు కోన లక్ష్మణ మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకనుగుణంగా కనీస వేతనం అమలు చేయాలని, ప్రతినెలా ఒకటి తేదీకి జీతాలు చెల్లించి, పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లు సమస్యలు పరిష్కారం చేసే వరకూ అండగా ఉంటామని చెప్పారు. ఏఐటీయూసీ నాయకులు వాయిబోయిన శేఖర్, బి.రవి, క్లాప్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు జలగడుగుల శివ కుమార్, కార్యదర్శి పి.సతీష్, నాయకులు ఉమా మహేశ్వరరావు, జైరాం, చిరంజీవి, డ్రైవర్లు పాల్గొన్నారు.

ఆరోపణలు సరికాదని తహశీల్దారుకు వినతి

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని గౌరీపట్నం గ్రామంలో ఉన్న తన భూమిపై పలువురు ఆరోపణలు చేస్తున్నారని, అవి సరికాదని గౌరీపట్నం గ్రామానికి చెందిన తోట వెంకట సత్యవతి మంగళవారం స్థానిక తహశీల్దారకు వినతిపత్రం అందజేశారు. తన తల్లి అయిన అప్పల నరసమ్మ ద్వారా ఈ భూమి తనకు వారసత్వంగా వచ్చిందని, ఆ భూమి తమ ఆధీనంలోనే ఉందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ భూమి విషయంలో తమ గ్రామానికి చెందిన కొందరు తనపై పలు ఆరోపణలు చేస్తున్నారని, అది వాస్తవం కాదని తెలిపారు. ఆమె వెంట మాజీ సర్పంచ్ కోన వెంకట అప్పారావు, ఉప సర్పంచ్ కోన శ్రీనివాసరావు ఉన్నారు.

గ్రామీణులకు మెరుగైన వైద్యం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానం ప్రవేశపెట్టిందని మండలంలోని కెపి.అగ్రహారం సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం కేపీ అగ్రహారం గ్రామ సచివాలయం పరిధిలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 104 వైద్యాధికారి కె.వెంకటకృష్ణ ఆధ్వర్యంలో వివిధ రోగులకు సంబంధించి 80 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. గర్భిణులకు ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు చేశారు. అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి పిల్లలకు, కదలలేని స్థితిలో ఉన్న వృద్ధులకు వారి ఇంటి వెళ్లి వైద్య సేవలు అందించారు. ఎంఎల్‌ఎచ్‌పిలు పావని, బండారు దేవి, వెంకటేష్, ఎఎన్ఎమ్ హైమావతి, ఆశాలు రమణమ్మ, రామలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య సేవలు అందిస్తున్న డాక్టరు వెంకటకృష్ణ, సిబ్బంది

వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలకు స్పందన

శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాల్లో భాగంగామంగళవారం రెండోరోజున విద్యార్థులకు పలు అంశాలపై తర్ఫీదునివ్వడంతోపాటు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. పౌర గ్రంథాలయాధికారుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు శిక్షణనిచ్చారు. విద్యార్థులు, పాఠకులు ఎంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

(ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)

స్పోకెన్ ఇంగ్లీష్‌పై విద్యార్థులకు శిక్షణ

నక్కపల్లి: మండలంలోని చినదొడ్డిగల్లు శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథాలయ అధికారి జనార్ధన్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్‌పై శిక్షణ ఇచ్చారు. హైస్కూల్ టీచర్ శ్రీదేవి విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ నేర్పించారు. పిల్లలతో ఇంగ్లీష్ కథల పుస్తకాలను చదవించారు. జోగేశ్వరరావు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అప్పలరాజు, సిబ్బంది రమణమ్మ పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : స్థానికశాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరానికి విశేష స్పందన లభించింది. రాజ్యలక్ష్మి టీచర్ పాల్గొని, విద్యార్థులకు సైన్స్ క్విజ్, నీతి కథలు, పద్యాలు చదివించి, వివరించారు. పొడుపు కథలు. వాటి ప్రాముఖ్యత తెలియజేశారు. విశ్రాంత ఉపాధ్యాయుడు ప్రభాకర్ ఆంగ్లభాష పరిజ్ఞానంపై విశ్లేషణ, ఉద్యోగ సాధనకు తర్ఫీదునిచ్చారు. ఇంగ్లీషు, గణితం అభివృద్ధికి సూచనలు చేశారు. విద్యార్థి దశ నుంచే మాతృభాషతోపాటు ఇంగ్లీష్‌పై పట్టు సాధించాలని విద్యార్థులను కోరారు. లైబ్రేరియన్ పి.దమయంతి ఆధ్వర్యంలో 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు

గొలుగొండ : గొలుగొండ శాఖ గ్రంథాలయంలో లైబ్రేరియన్ రాజుబాబు ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం రెండవ రోజులో భాగంగా విద్యార్థులకు డ్రాయింగ్ కాంపిటీషన్, కథలు చెప్పటం పోటీలు నిర్వహించారు. 40 మంది విద్యార్థినీ విద్యార్థులు ఎంత ఉత్సాహంగా పాల్గొన్నారు. రిసోర్స్‌పర్సన్‌గా వి.శ్రీనివాసరావు వ్యవహరించారు. సిఆర్‌పి సిహెచ్.సత్యనారాయణ పాల్గొన్నారు



నక్కపల్లిలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న టీచర్ శ్రీదేవి

సబ్బవరం : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పలు పాఠశాలలకు చెందిన 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంథాలయాధికారి వి.శిరీష ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాణి పాల్గొన్నారు.



సబ్బవరంలో చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కోటవురట్ల : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనంపై రాజుపేట ఉపాధ్యాయులు ప్రసాదరావు పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని, పుస్తకపఠనంతో విజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. లైబ్రేరియన్ పాల్గొన్నారు.

కశింకోట :మండలంలోని తాళ్ళపాలెం శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరానికి మంచి స్పందన లభిస్తోంది. రెండవ రోజు శిబిరంలో 21 మంది పిల్లలు పాల్గొన్నారు. సోమవారం చెప్పిన కథకు చిన్నారి పావని పేరు పెట్టి చక్కగా ముగింపు రాసింది. గ్రంథాలయ అధికారి కె.జగన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉపాధ్యాయులు బి.సురేష్ బివి నరసింహమూర్తి, గాయత్రి స్కూల్ ప్రిన్సిపల్ వై.నగేష్ పాల్గొన్నారు.

మునగాడ : ప్రకాష్‌నగర్‌లోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణా శిబిరంలో రెండవ రోజు ఆంగ్ల భాష నైపుణ్యంపై తరగతులను నిర్వహించారు. జాతీయ సేవా పథకం కార్యకర్త తనూషా ఆధ్వర్యాన ఇంగ్లీష్‌పై శిక్షణ నిర్వహించారు. అనంతరం ప్రముఖ కవి కె.సత్తిరాజు నీతి కథలను విద్యార్థులకు వివరించారు. ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి ఐఎస్.భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయా దేవి పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ రమణ మృతి



ఎస్‌పిఎల్ రమణ

ప్రజాశక్తి-మాడుగుల : మాడుగుల ప్రస్తుత ఎంపిపి వేమవరపు రామధర్మజ (పెదబాబు) తండ్రి, వైసిపి నేత, మాడుగుల మాజీ సర్పంచ్ వేమవరపు వెంకటరమణ (ఎస్‌పిఎల్ రమణ) మంగళవారం మృతి చెందారు. కొన్నాళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడు తున్న ఆయన మంగళవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. చిన్నతనంలో మాడుగుల హైస్కూల్‌లో ఎస్‌పిఎల్‌గా వ్యవహరించడంతో,. అనాటి నుండి ఎస్‌పిఎల్ రమణగానే పేరు పొందారు. రాజకీయ నేత గా, కాంట్రాక్టరుగా జిల్లావ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు పొందారు. మృతుడు రమణకు భార్య, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు వున్నారు.

నాక్ అడ్వైజర్ రమేష్‌కు అభినందన

ప్రజాశక్తి-చేపగుంట : కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా అవార్డు పొందిన నాక్ అడ్వైజర్ పి.రమేష్‌ను విశాఖ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ జి.సత్యనారాయణ, ప్రిన్సిపల్ డాక్టర్ వి.శ్రీధర్ పట్నాయక్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు. హయ్యర్ ఎడ్యుకేషన్‌లో పి.రమేష్ చేసిన సేవలకు గానూ ఈ అవార్డును ప్రదానం చేసినట్టు వారు పేర్కొన్నారు.

నిరుపేద కుటుంబానికి చేయూత



నగదు సాయం అందజేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి-కొత్తకోట : ఇటీవల తీవ్ర అనారోగ్యంతో మృతి చెందిన నిరుపేద వైశ్య కుటుంబానికి కొత్తకోటకు చెందిన న్యూ వాసవి క్లబ్ సభ్యులు రూ.29,200 నగదు సాయం మంగళవారం అందజేశారు. గ్రామానికి చెందిన పడమటి నరసింహమూర్తి ఇటీవల తీవ్ర అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి స్థానిక న్యూవాసవి క్లబ్ తరపున ఆర్థికసాయం అందించి బాసటగా నిలిచారు. కార్యక్రమంలో న్యూవాసవి క్లబ్ అధ్యక్షులు, సెక్రెటరీ, ట్రెజరర్, సభ్యులు కామేష్, గురుమూర్తి, సంతోష్ కుమార్, రాజేష్, పెంటపాటి అశోక్ పాల్గొన్నారు.

ఈద్గా స్థల సమస్యపై వినతి

ప్రజాశక్తి -కంచరపాలెం : మర్రిపాలెంలో బిఆర్‌టిఎస్ రోడ్డు విస్తరణలో ముస్లిముల ప్రార్ధన స్థలం కోల్పోవడంతో దానికి బదులు హెచ్‌పి పెట్రోల్ బంక్ పక్కన ఉన్న ఆర్ అండ్ బి స్థలం కేటాయించాలని కోరుతూ ముస్లిం పెద్దలతో కలిసి ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు మంగళవారం కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ ఆలీ, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఫారూఖీ, షేక్ బాబ్జి, ఆల్ఫా కమిటీ ప్రతినిధులు ఎమ్‌డి గౌస్, మహబూబ్ సుభాని, బాబా, బాబ్జి, జిలాని, ఎమ్‌డి భాషా, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనుల పరిశీలన

ప్రజాశక్తి-ఉక్కునగరం : జివిఎంసి 87వ వార్డు పరిధిలో పలు రోడ్డు మరమ్మత్తు పనులను వైసిపి ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు పరిశీలించారు. నాణ్యత విషయంతో రాజీ పడొద్దని కాంట్రాక్టర్లకు, సచివాలయ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు జెర్రిపోతుల ఈశ్వరరావు, సీతారామరాజు, వర్రె రాజు, వడ్లపూడి ఈశ్వరరావు, ద్రోనాద్రి సూరిబాబు, కర్రి అంజి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ తల్లి జాతర



అమ్మవారికి చీర, జాకెట్ సమర్పిస్తున్న అనిత

ప్రజాశక్తి -ఎస్.రాయవరం : మండలంలో రేవు పోలవరం గ్రామంలో మంగళవారం బంగారమ్మ తల్లి జాతర మహోత్సవానికి పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత పాల్గొన్నారు. అమ్మవారికి చీర జాకెట్ పసుపుకుంకుమలు సమర్పించి, ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం అన్న సమారాధనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు అమలకంటి అబద్ధం, నల్లపురాజు వెంకటపతి రాజు, బొట్ట వరహాలు, లవరాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

51వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 51వ వార్డు పరిధి మాధవధార శంకర్‌నగర్, విద్యానగర్ ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. విశాఖ ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నుంచి ప్రజా శ్రేయస్సు కోసం ప్రతి క్షణమూ పాటు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పైడి శ్రీను, రాయుడు శ్రీను, ఆళ్ల శివ గణేష్, అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతు కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -మాడుగుల : పిడుగుపాటుతో జీవనాధారమైన పాడిగేదె మృతి చెందడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న మాడుగులకు చెందిన యాళ్ళ కొండమ్మ కుటుంబానికి జనసేన నేత రొబ్బా మహేష్ మంగళవారం ఆర్థికసాయం అందించారు. పిడుగుపాటుతో పాడిగేదెను నష్టపోయిన బాధితులకు రూ.10వేలు సాయాన్ని అందజేశారు.కార్యక్రమంలో వేమన గోవింద్, ఇల్లపు రమేష్, గణేష్, అప్పి, నూకరాజు, నాగు, శాం తో నూకరాజు, నాయుడు, పూడి పండు పాల్గొన్నారు



నగదు సాయం అందిస్తున్న మహేష్

సబ్సిడీపై సంపూర్ణ మిశ్రమ దాణా పంపిణీ

ప్రజాశక్తి-మాడుగుల : పాడిరైతులకు పంపిణీకి 60 శాతం సబ్సిడీపై సంపూర్ణ మిశ్రమదాణా రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉన్నట్టు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ చిట్టినాయుడు తెలిపారు. కిలోదాణా రూ.15.90కాగా, రూ.9.40 సబ్సిడీ పోను, రైతు రూ.6.50 చెల్లించి దాణా పొందవచ్చని సూచించారు. సంపూర్ణ మిశ్రమ దాణాను పాడి పశువులకు అందించడం ద్వారా పాల దిగుబడి, పాలలో వెన్నశాతం పెరుగుతుందన్నారు. పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మండు వేసవిలో మంచు సోయగం

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో మంగళవారం మండు వేసవిలో భిన్న వాతావరణం చోటుచేసుకుంది. ఉదయాన్నే శీతాకాలాన్ని తలపించేలా మంచు సోయగం దర్శనం ఇచ్చింది. దీంతో ప్రకృతి ప్రేమికులు ఆనందం వ్యక్తం చేయగా, మధ్యాహ్నం నుంచి భానుడు తన ఉగ్రరూపాన్ని ప్రదర్శించడంతో తర్వాత ఎండవేడిమి తాళలేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వేసవిలో మండుటెండల సమయంలో ఇలా మంచు కురవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేశారు.



ఉదయాన్నే దట్టంగా కురుస్తున్న మంచు

మోదకొండమ్మ కొలుపు ప్రారంభం



శతకంపట్టుకు ఊరేగింపుగా వెళుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి -మాడుగుల : వచ్చేనెల 6వ తేదీన జరగనున్న మాడుగుల మోదకొండమ్మ పండగను పురస్కరించుకుని మంగళవారం స్థానిక శతకంపట్టు వద్ద కొలుపు ఏర్పాటైంది. ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం మేళతాళాలు, బాణసంచా పేలుళ్లతో అమ్మవారి ఘటాలు, పాదాలను ఊరేగింపుగా తీసుకెళ్లి, శతకంపట్టు వద్ద కొలువు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సిద్ధాంతి భమిడిపాటి సుబ్రహ్మణ్య శాస్త్రి, ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, సభ్యులు దంగేటి సూర్యారావు, శ్రీనాథు శ్రీనివాసరావు, పైడి నాయుడు, ఎంపిపి పెదబాబు, సర్పంచ్ కళావతి, వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

సిఎం కప్ గోల్డ్ మెడల్ సాధించిన
మౌనిక, కృష్ణవేణిలకు సత్కారం



డిఎస్‌పి, సిఐలను అభినందిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్ : సిఎం కప్ గోల్డ్ మెడల్ సాధించిన నర్సీపట్నానికి చెందిన బొంతు మౌనిక, కృష్ణవేణిలను మంగళవారం నర్సీపట్నం డిఎస్‌పి ప్రవీణ్‌కుమార్, టౌన్ సిఐ నమ్మి గణేష్ అభినందించి, సత్కరించారు. ఎన్‌టిఆర్ స్టేడియంలో నింజాస్ అకాడమీ నిర్వహిస్తున్న ఉచిత సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను సందర్శించి, అక్కడి శిక్షణార్థుల బాక్సింగ్, కరాటే, నాన్‌చాక్ విన్యాసాలను తిలకించారు. క్రీడాకారులకు రొట్టెలు, కేక్‌లు, బిస్కెట్లు అందించారు.
ఈ సందర్భంగా డిఎస్‌పి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ క్రీడల వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయన్నారు. శారీరక, మానసిక దృఢత్వంతోపాటు జ్ఞాపకశక్తికి దోహదపడడంతోపాటు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ప్రత్యేక ప్రోత్సాహకాలుంటాయన్నారు. పట్టణ సిఐ గణేష్, స్పోర్ట్స్ కోటాలోనే ఉద్యోగాన్ని సంపాదించారన్నారు. క్రైమ్ పోలీసు, బిల్డర్ శ్రీను తమ శాఖ తరపున క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని అందించారు. కార్యక్రమంలో డైరెక్టర్స్ వెలగా నారాయణరావు, పారుపల్లి శ్రీనివాసరావు, వెలగా జగన్నాథం, బోళెం శివ, వూషు కోచ్ శేఖర్, శావ్ కోచ్ అబ్బు పాల్గొన్నారు.

14న జిల్లాస్థాయి ఓపెన్ చెస్ పోటీలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : అనకాపల్లి జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14న నర్సీపట్నం నలంద ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలో జిల్లాస్థాయి ఓపెన్ చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు అనకాపల్లి జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం వెంకటేశ్వరరావు తెలిపారు. తిరుపతిలో జరగనున్న రాష్ట్రస్థాయి ఓపెన్ క్యాటగిరీకి నలుగురు, విజయవాడలో జరుగు మహిళల కేటగిరీకి నలుగురిని ఎంపిక చేయడానికి ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరేళ్ల నుంచి అరవై ఏళ్ల వరకు అందరూ ఈ పోటీలలో పాల్గొనడానికి అర్హులన్నారు. ఓపెన్ కాంపిటీషన్, మహిళలకు ప్రత్యేకంగా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలలో పాల్గొనదలచినవారు 98668 46146, 99499 96908 నంబర్లకు ఫోన్ చేసి, ముందుగా పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు


సమావేశంలో మాట్లాడుతున్న తహాశీల్దార్ జానకమ్మ

ప్రజాశక్తి -కోటవురట్ల: రెవెన్యూ సమస్యలను పరిష్కరించడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని తహాశీల్దారు జానకమ్మ సూచించారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు సమస్యల పట్ల సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు, ప్రధానంగా సమగ్ర భూరక్ష భూసర్వే పథకం అమలులో నిర్లక్ష్యంపై మండిపడ్డారు. అదేవిధంగా స్పందనలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత గృహ హక్కు పత్రాలు అర్హత కలిగిన వారందరికీ అదే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రానున్న విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో వారికి ధ్రువపత్రాలు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఉర్థవరావు, సీనియర్ అసిస్టెంట్ గణపతిరావు, విఆర్‌ఒల సంఘ అధ్యక్షులు రామచంద్రమూర్తి పాల్గొన్నారు.

ఆలయం చెంత అపారిశుధ్యం!

ఆవేదన చెందుతున్న భక్తులు, ప్రజలు


దుర్గగుడి వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం

ప్రజాశక్తి -ఎస్.రాయవరం : మండలలో ధర్మవరం అగ్రహారం శ్రీదుర్గాదేవి గుడికి ఎదురుగా ఉన్న ఖాళీస్థలంలో పెద్ద ఎత్తున చెత్తచెదారాన్ని వేస్తుండడంపై పలువురు ఆవేదన చెందుతున్నారు. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.అప్పలరాజు మంగళవారం సోషల్ మీడియా ద్వారా దుర్గగుడి వద్ద అపారిశుధ్యంపై ఎంపిడిఒ స్పందించాలంటూ పోస్టు పెట్టి విన్నవించారు
మండల కేంద్రానికి వెళ్లే జాతీయ రహదారి నుంచి శ్రీ దుర్గా దేవి గుడి వరకు రోడ్డుపొడుగునా పెద్ద ఎత్తున చెత్తాచెదారం పేరుకుపోవడంతోపాటు కొత్తగా నిర్మించిన పక్క కాలువలోను, అలాగే గ్రామంలో అనేక ప్రాంతాల్లో పెద్ద ఎత్తున చెత్తచెదారం పేరుకుపోయి ఉందని పలువురు ఆవేదన చెందుతున్నారన్నారు. క్షీణించిన పారిశుధ్యం, దుర్గంధంతో ప్రజలు అనునిత్యం అవస్థలు పడుతుండడమే కాకుండా, పవిత్రంగా ఉండాల్సిన ఆలయ పరిసరాల్లోనూ చెత్త నిండుకుంటుండడంతో భక్తులు ఆవేదన చెందుతున్నారు. అంతేకాక అపారిశుధ్యంతో ఈగలు, దోమలు విజృంభించి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆవేదన చెందుతున్నారు. ఎంపిడిఒ వెంటనే స్పందించి, ధర్మవరం అగ్రహారంలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు తగు చర్యలు చేపట్టాలని వేడుకున్నారు.

అక్రమ నిర్మాణం నిలిపివేతకు ఆదేశం

'ప్రజాశక్తి' వార్తకు స్పందన


అక్రమ నిర్మాణం పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి-గొలుగొండ : యథేచ్ఛగా అక్రమ కట్టడాలు శీర్షికన ప్రజాశక్తి పత్రికలో సోమవారం వచ్చిన కథనానికి మంగళవారం రెవెన్యూ అధికారులు స్పందించారు. మండలంలో కృష్ణదేవిపేట గ్రామంలో ఎంపిపి పాఠశాల ప్రహరీని అనుకుని చేపడుతున్న అక్రమ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని మండల రెవెన్యూ అధికారి నాగరాజు ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం అక్రమ నిర్మాణం జరుగుతున్న ప్రదేశానికి వెళ్లి సంబంధిత యజమాని పిలిపించి మాట్లాడారు. ఆర్అండ్‌బి ప్రాంతాల్లో అక్రమ కట్టడాలు నిర్మించకూడదని హెచ్చరించారు అక్రమ నిర్మాణం కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ శ్రీధర్, స్థానికులు పాల్గొన్నారు

కల్యాణ మండపం పూర్తి చేయండి

సెల్ఫీ ఛాలెంజ్ చేసిన కౌన్సిలర్ రామరాజు


అసంపూర్తి కల్యాణమండపం వద్ద సెల్ఫీతో రామరాజు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : స్థానిక ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్, ఇతర వైసిపి నేతలకు సత్తా, చిత్తశుద్ధి ఉంటే ఉత్తరవాహిని నదీతీరాన సత్యనారాయణ స్వామి గుడి వద్ద ఎసి కల్యాణ మండపం పనులు పూర్తి చేయించాలని మున్సిపాలిటీ 20వ వార్డు కౌన్సిలర్ రామరాజు సెల్ఫీ ఛాలెంజ్ చేశారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ, 2017-18లో టిడిపి హాయాంలో ఆ పార్టీనేత ఉత్తరవాహిని నదీతీరాన సత్యనారాయణస్వామి గుడి, కల్యాణ మండపం నిర్మాణానికి పూనుకున్నారని, అయితే ఆలయ నిర్మాణం పూర్తయి నేడు దైవదర్శనాలు జరుగుతుండగా, కల్యాణమండపం పనులు మాత్రం 70శాతం వరకు చేశారన్నారు. 2019లో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం, తర్వాత ప్రభుత్వం మారడంతో మిగిలిన పనులు పూర్తి చేయించలేకపోయామన్నారు. కానీ గడచిన నాలుగేళ్లలో కల్యాణమంపడం పూర్తి చేసేందుకు ప్రస్తుత ఎమ్మెల్యే గణేష్, ఇతర అధికార పక్ష నేతలు ఇసుమంతైనా చర్యలు చేపట్టడం లేదు. దీంతో ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందాన అసంపూర్తిగా ఉన్న కల్యాణమండప నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే, వైసిపి నేతలు చర్యలు చేపట్టాలని కోరారు.

చెరువులోని ఆక్రమణల తొలగింపు


సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలం కొత్తకోట గ్రామ సమీపంలో నాయుడు చెరువు ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు దృష్టి సారించారు. గ్రామానికి చెందిన ఎంపిటిసి సభ్యులు, పూడి దేవ గత నెల 20న స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్ మహేశ్వరరావు ఆదేశాలతో మంగళవారం సర్వే నెంబర్ 227లోని స్థానిక నాయుడు చెరువులో ఆక్రమణలను గుర్తించారు. సుమారు మూడు ఎకరాల మేర అక్రమణకు గురైనట్టు గుర్తించారు. సరిహద్దులు వేసి ఆక్రమణలను తొలగించారు.
ఈ సందర్భంగా ఎంపిటిసి పూడి దేవ మాట్లాడుతూ ఆయుకట్టుదారుల వినతి మేరకు చెరువును అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే ప్రణాళికను సంబంధిత అధికారులు సిద్ధం చేశారన్నారు. రూ 10 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో చెరువును అభివృద్ధి చేయనున్నారని, ఆక్రమణదారులు సహకరించాలని కోరారు. సర్వేలో విఆర్ఒ లక్ష్మి, లైసెన్స్ సర్వేయర్ శ్రీరామూర్తి, విఆర్ఎ మధు పాల్గొన్నారు.

నేటి పాలీసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : ఈనెల 10న నిర్వహించనున్న పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పాలిసెట్-2023) నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు నర్సీపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జివి రామచంద్రరావు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందని, విద్యార్థులను ఉదయం 9.30 గంటల నుంచే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. ఉదయం 11 గంటల తరువాత వచ్చిన వారిని ఎట్టి పరిస్థితుల్లోను పరీక్ష కేంద్రంలోకి అనుమతించరన్నారు. జిల్లాలో అనకాపల్లి డివిజన్‌లో 16, నర్సీపట్నం డివిజన్‌లో 11 పరీక్ష కేంద్రాలలో 9324 మంది విద్యార్థులు పాలిసెట్‌కు హాజరు కానున్నారని తెలిపారు.
విద్యార్థులు హాల్ టికెట్, హెచ్‌బి పెన్సిల్, ఎరేజర్, బాల్ పాయింట్ పెన్ (బ్లూ లేదా బ్లాక్) తమ వెంట తీసుకురావాలన్నారు. మొబైల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష కేంద్రంలోకి అనుమతించరన్నారు. ఒకవేళ హాల్ టికెట్ జనరేట్ కాకపోతే ఉదయం 9 గంటలకే పాలిసెట్ జరిగే ఏ పరీక్ష కేంద్రానికైనా వెళ్లి, వివరాలు చెప్పి హాల్ టికెట్ తీసుకునేలా ఏర్పాట్లు చేశారన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులందరూ గమనించాలనికోరారు.

ఎంవిఆర్ ఉచిత తీర్థయాత్ర



తీర్థయాత్రకు వెళుతున్న గ్రామీణ ప్రాంత పేద భక్తులు

ప్రజాశక్తి-గొలుగొండ : మండలం పాకలపాడు గ్రామం నుండి ఎంవిఆర్ ఉచిత తీర్థయాత్రలో భాగంగా 50 మంది పేద భక్తులు మంగళవారం బయలుదేరారు. అనకాపల్లికి చెందిన ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్) సొంత నిధులతో ఈ తీర్థయాత్రలు చేపడుతున్నట్లు ఎంవిఆర్ యువసేన సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సీపట్నం నియోజకవర్గంలో పేద భక్తులను గుర్తించి వారిని అన్నవరం, సింహాచలం, విశాఖపట్నం, వెంకటేశ్వరస్వామి ఆలయం కనకమహాలక్ష్మి దేవాలయం దర్శనానికి ప్రత్యేక బస్సులో తీసుకెళుతున్నామన్నారు. ఈ సందర్భంగా యాత్రికులు ఎంవిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసారు. అనంతరం వారు మాట్లాడుతూ దైవ దర్శనానికి నోచుకోలేని పేద భక్తులను ఈ విధంగా ఉచితంగా దేవాలయాలకు తీసుకెళ్లడం ఆనందంగా ఉందన్నారు.

ఎపిడబ్ల్యుజెఎఫ్ నూతన కార్యవర్గం


నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న పాత్రికేయులు

ప్రజాశక్తి -పాయకరావుపేట: పాయకరావుపేట నియోజకవర్గం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైందని ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా కార్యదర్శి బి ఈశ్వరరావు తెలిపారు. మంగళవారం పాయకరావుపేటలోని ద్వారక హోటల్‌లో మాజీ అధ్యక్షుడు ముత్తా గోవిందరావు అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గస్థాయి సమావేశంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, సంఘ బలోపేతానికి మరింత కృషి చేయాలని జిల్లా కార్యదర్శి ఈశ్వర్రావు పిలుపునిచ్చారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాయకరావుపేట నియొజకవర్గ ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా పినపాత్రుని రామం, ఉపాధ్యక్షులుగా మొల్లేటి వీరవెంకటలక్ష్మీ కుమారి, కార్యదర్శిగా కీర్తి కన్నబాబు, సహాయ కార్యదర్శిగా గింజాల వెంకటరమణ, కోశాధికారిగా మురుకుర్తి శ్రీనువాసరావు, సభ్యులుగా వంగలపూడి మధుబాబు, పడాల ఈశ్వరరావు, పసగడుగుల శేఖర్, సాధు వరప్రసాద్ ఎంపికయ్యారు.